## మరో మూడేళ్లు సిఎం రేవంత్ రెడ్డే




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## మా రోడ్డు చూడండి సారూ...




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 180 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 27 జూన్ 2025






● యువతను ఆరోగ్యంగా ఉజ్వల భవిష్యత దిశగా నడిపించాలి ● డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి ● అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సిఎం పిలుపు

# మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం కృషి

**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మాదక ద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ , ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ నటులు రామ్ చరణ్, విజయ దేవరకొండ , నిర్మాత దిల్ రాజ్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, చేవెళ్ల బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పలు రకాల స్టాళ్లను పరిశీలించారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చడానికి అందరూ కృషి చేయాలని ఎఫ్‌డీసీ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మధ్యే మలయాళ చిత్ర మిగతావి 2లో

## షాంఘై సదస్సులో రాజ్‌నాథ్
# సంచలన నిర్ణయం

☛ పహల్గామ్ ప్రస్తావన లేకపోవడంపై నిరసన
☛ జాయింట్ డాక్యుమెంట్‌పై సంతకానికి నిరాకరణ



**బీజింగ్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** చైనా పర్యటనలో ఉన్న భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ షాంఘై సహకార సంస్థ సదస్సులో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ద్వైపాక్షిక ఒప్పందపై సంతకాన్ని తిరస్కరించారు. షాంఘై సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. సమావేశం మిగతావి 2లో



## నగరంలో ఆషాఢ బోనాల సందడి

- గోల్కొండలో తొలి బోనం సమర్పించిన కవిత


## నిజామాబాద్ పసుపుబోర్డు
# రైతులకు గర్వకారణం

● 29న బోర్డును ఆవిష్కరించనున్న హోంమంత్రి అమిత్ షా
● నిజామాబాద్ పర్యటనలో కిషన్ రెడ్డి వెల్లడి



**నిజామాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నిజామా బాద్ ప్రాంత రైతులకు పసుపు బోర్డు బహుమతి అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నిజా మాబాద్‌లో పర్యటిస్తున్న ఆయన.. మీడియా సమావేశంలో మాట్లాడారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని చెప్పారు. ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఫోన్‌ట్యాపింగ్ కేసును సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు నిజామాబాద్ ప్రజలు గర్వించాల్సిన సమయం అని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పసుపు బోర్డు మిగతావి 2లో

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోల మృతి



**రాయ్‌పూర్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల మాడ్ డివిజన్ సీనియర్ కేడర్ అబూజ్‌మడ్ అడవుల్లో ఉన్నారన్న సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) మిగతావి 2లో

## ప్రాజెక్టుల నిర్వహణలో
# సర్కార్ నిర్లక్ష్యం

● జూరాల రోప్ తెగిపోవడమే నిదర్శనం
● బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రాజెక్టుల నిర్వహణ కూడా రాకపోవడం వల్లే జూరాల ప్రమాదంలో పడిందని బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. జూరాల రోప్ 9వ నంబర్ గేట్ తెగిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద మెయింటెనెన్స్ పనులు చేయలేదని, మెయింటెనెన్స్ పనులు చేయించడంలో నిర్లప్తత స్పష్టంగా కనిపిస్తోందని కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. జూరాలకు వరద ఉధృతి దృష్ట్యా ఇప్పటికైనా మిగతావి 2లో



## పార్లమెంట్ ఎప్పటికీ
# సుప్రీం కాదు

దేశంలో ప్రజాస్వామ్యం అత్యుతన్నదమైనది
భారత సుప్రీం ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ వ్యాఖ్య

**ముంబై,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్‌లో రాజ్యాంగమే అత్యున్నతమైందని.. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు దాని కిందే పనిచేస్తాయని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. అందరూ అనుకుంటున్నట్లు లేదా భావిస్తున్నట్లు పార్లమెంట్ సుప్రీం కాదన్నారు. ప్రజాస్వామ్యం ఛత్రం కింద పార్లమెంట్ ఒకటని అభిప్రాయపడ్డారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు అధికారాలు ఉన్నాయి. మిగతావి 2లో

## 345 గుర్తింపులేని రాజకీయ పార్టీలపై అనర్హత

- ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం




**న్యూఢిల్లీ,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను గుర్తించి వాటిని డీలిస్ట్ చేసే పక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని ఈసీ గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6? ఓట్లను లేదా నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి. మిగిలిన పార్టీలను నమోదిత గుర్తింపులేని పార్టీలుగానే పరిగణిస్తారు.

# జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నా..

- అంతరిక్షం నుంచి శుభాన్షు శుక్లా సందేశం



**న్యూఢిల్లీ, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా రోదసి ప్రయాణం విజయవంతంగా ప్రారంభమైంది. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు ప్రయోగించిన స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ నిప్పులు చిమ్ముతూ విజయవంతంగా రోదసిలోకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా అంతరిక్షం నుంచి శుభాన్షు ఓ సందేశం పంపారు. ఈ ప్రయాణంలో ప్రతిక్షణాన్ని ఆస్వాదిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తాను జీరో గ్రావిరటీకి అలవాటు పడుతున్నట్లు చెప్పారు. 'అందరికీ నమస్కారం.. తోటి వ్యోమగాములతో ఇక్కడ ఉండటం చాలా సంతోషంగా ఉంది. వావ్.. ఇది ఎంత అద్భుతమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో ప్రతిక్షణాన్ని నిజంగా ఆస్వాది స్తున్నాను. ఇప్పుడిప్పుడే నడవడం నేర్చుకునే చిన్నారిలా.. జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నాను. ఎలా కదలాలో, నన్ను నేను ఎలా నియంత్రించుకోవా, ఎలా తినాలో తెలుసుకుంటున్నా' అంటూ శుభాన్షు మిగతావి 2లో

## పిల్లల వరకు చేరుతున్న డ్రగ్స్

- చాక్లెట్లు, బిస్కట్ల రూపంలో సరఫరా - ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



# మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం కృషి

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలో ఓ నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధరణ అయితే, ఇండస్ట్రీ నుంచి బహిష్కరిస్తారు. అలాగే తెలంగాణ ఎఫ్‌డీసీ, తెలుగు చిత్ర పరిశ్రమ తరపున కోరుకునేది ఒక్కటే. అలాంటిది ఇక్కడ జరిగిందని తెలిస్తే, వారిని ఇండస్ట్రీలో అడుగు పెట్టకుండా నిషేధించాలి. అప్పుడే సమాజానికి సందేశం వెళ్తుంది. ఎఫ్‌డీసీ తరపున చిత్ర పరిశ్రమ పెద్దలతో మాట్లాడి తెలుగు సినిమాలోనూ పాటించేలా చేస్తాం. ఇది మన కర్తవ్యం. డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చడానికి మనమంతా ప్రతిజ్ఞ చేయాలి‘ అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. ‘నేనో చిన్న ప్రపంచంలో బతుకుతా. బయట ఏం జరుగుతుందో పెద్దగా తెలియదు. నేను విశాఖ పోర్ట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ గురించి బైట్ ఇవ్వమని ఓ పోలీస్ ఆఫీసర్ అడిగారు. గౌరవం కొద్దీ ఇచ్చాను. కానీ, ఇప్పుడు ఇంటర్నేషనల్ డే ఉందని తెలిసిన తర్వాత కొంతమంది పోలీస్ ఆఫీసర్‌లను కలిశా. వారు చెప్పిన విషయాలు విని, కచ్చితంగా దీనిపై మాట్లాడాలని పించింది. దీనిని ఒక బాధ్యతగా తీసుకుంటున్నా. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే యుద్ధం అవసరం లేదు. యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తే చాలు. కొన్ని దేశాలు యువతకు మత్తు అలవాటు చేసి దేశ భవిష్యత్‌ను నాశనం చేయాలని అనుకుంటున్నారు. డ్రగ్స్ మన జీవితాల్ని నాశనం చేస్తాయి. ఒక్కసారి వాటికి అలవాటు పడితే కోలుకోవడం చాలా కష్టం. మీ స్నేహితులు డ్రగ్స్ అలవాటు చేస్తే వారికి దూరంగా ఉండాలి. మనమంతా ఆరోగ్యంగా ఉండాలి. వ్యాయామం చేయాలి. మన తల్లిదండ్రులు గౌరవంగా ఉండేలా చూడాలి. విజయం, డబ్బు, గౌరవం లేని పని చేయటం అనవసరం‘అని చెప్పుకొచ్చారు. అనంతరం రామ్‌చరణ్ మాట్లాడుతూ.. ‘మీ వయసులో ఉన్నప్పుడు అవగాహన కార్యక్రమాలకు స్కూల్ తరపున వెళ్లేవాడిని. ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గతంలో కొన్ని స్కూల్స్ బయట డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసి బాధేసింది. అప్పుడు నేను తండ్రిని కాదు. ఇప్పుడు నేనూ ఒక తండ్రిని. ఒక విజయవంతమైన సినిమా చేసినప్పుడు ఎంతో గర్వంగా ఉంటుంది. పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటే గొప్పగా ఉంటుంది. స్నేహితులతో కలిసి సాయంత్రం ఆడుతుంటే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. రోజూ వ్యాయామం చేస్తూ నచ్చిన పని చేసుకుంటూ, కుటుంబంతో హ్యాపీగా ఉండండి. మన కుటుంబంతో మొదలు పెట్టి స్కూల్, సమాజం బాగుచేసుకుందాం. ఈ విషయంలో పోలీస్‌శాఖ కృషిని ప్రశంసిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఒక్కో సైనికుడిలా మారదాం.. డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం‘ అని అన్నారు.

# షాంఘై సదస్సులో రాజ్‌నాథ్ సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం దీనిపై జాయింట్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశారు. అయితే, అందులో పహల్గాం ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది. చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఇందులో భారత్, చైనా, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్.. ఉగ్రవాదంపై భారత కఠిన వైఖరిని సుస్పష్టంగా ప్రతిబింబించలేకపోయింది. అంతేగాక, ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లో చోటు చేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం జరిగింది. దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఉగ్రవాద అంశంపై సదస్సులో భిన్నాభిప్రాయాలు రావడంతో సమావేశం అనంతరం రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. పాకిస్థాన్ వల్లే ఈ జాయింట్ డాక్యుమెంట్ నుంచి పహల్గాం ప్రస్తావనను మినహాయించి ఉంటారనే సంకేతాలు కన్పిస్తున్నాయి. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది. అంతకుముందు ఈ సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా వాడుకుంటున్నాయని పరోక్షంగా దాయాదిని దుయ్యబట్టారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పవన్నారు. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇక, 2020లో గల్వార్ ఘర్షణ తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. బెలారస్, చైనా, భారత్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి.

# ప్రాజెక్టుల నిర్వహణలో సర్కార్ నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని సూచించారు. జూరాల ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కెటిఆర్ కోరారు. జూరాల ప్రాజెక్టులోని 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఒక్క ఇటుక పేర్చడం కూడా చేతకాని ముఖ్యమంత్రికి కనీసం ఉన్న ప్రాజెక్టు నిర్వహణ కూడా రాకపోవడం వల్లే జూరాల ప్రాజెక్టు డేంజర్‌లో పడిందని ఆరోపించారు. ప్రతిఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద మెయింటెనెన్స్ పనులు చేయించడంలో రేవంత్ సర్కారు నిర్లిప్తత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. జూరాలకు క్రమంగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని అన్నారు. ఇప్పటికే ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల ఎస్.ఎల్.బి.సి టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెద్దవాగుకు గండిపడి 16 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, వట్టెం పంప్ హౌజ్ మునిగిపోయిందని, సుంకిశాల రిటేనింగ్ వాల్ కుప్పకూలి వందల కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇప్పుడు జూరాల 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడంతోపాటు ఇతర గేట్ల రోప్‌లు బలహీనంగా ఉండటం ప్రాజెక్టును ప్రమాదంలోకి నెట్టిందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు ఎగువ నుంచి పెరుగుతున్న ఇన్ ఎ÷-లోను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పార్లమెంట్ ఎప్పటికీ సుప్రీం కాదు

(మొదటి పేజీ తరువాయి)

కానీ, రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం అది మార్చలేదన్నారు. భారత 52వ సీజేఐగా గవాయ్ గత నెల బాధ్యతలు స్వీకరించారు. తూర్పు మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. ‘ చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. మనం విధులు నిర్వహిస్తున్నామని న్యాయమూర్తులు ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. కేవలం మనకు అధికారం మాత్రమే లేదు. బాధ్యతలు కూడా ఉన్నాయి. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారు అన్నది జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలి‘ అని పేర్కొన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా నిలుస్తానన్నారు. బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు మీద ఆయన స్పందించారు. ప్రతిఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలన్నారు. చిన్నప్పుడు తాను ఆర్కిటెక్ట్ కావాలనుకొన్నట్లు చెప్పారు. కానీ, తాను లా చదవడం తన తండ్రి కోరిక అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన అరెస్టు కావడంతో.. లా చదవలేక పోయారన్నారు.

# పిల్లల వరకు చేరుతున్న డ్రగ్స్

- చాక్లెట్లు, బిస్కట్ల రూపంలో సరఫరా
- ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



**ములుగు,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో డ్రగ్స్ వ్యసనం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, నేషనల్ ఆంటీ డ్రగ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే వ్యాధి యువతను భయంకరంగా పీడిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ‘ఇది ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే వినిపించే సమస్య. ఇప్పుడు మాత్రం స్కూళ్ల దాకా ప్రవేశించింది. చాక్లెట్లు, బిస్కెట్లు రూపంలో పిల్లలకు చేరుతోంది. ఇది అత్యంత భయంకరమైన పరిస్థితి,‘ అని సీతక్క అన్నారు. డ్రగ్స్‌ను వ్యాపారంగా మార్చిన కొంతమంది, లాభాల కోసం సమాజాన్ని మత్తులోకి లాగుతున్నార న్నారు. డ్రగ్స్‌కు బానిసలైన విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు బాధను మిగులుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ‘ఇలాంటి వారిని సొసైటీ కూడా తిరస్కరించే అవకాశం ఉంది. ఇది కేవలం వారి జీవితమే కాదు ? సమాజానికే ప్రమాదం‘ అని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వాడకం మూలంగా చిన్నారులపై అత్యాచారాలు, వృద్ధులు ఆడపిల్లలపై రేపులు, హత్యలు వంటి దారుణాలు జరుగుతున్నాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ‘ఇది నేరం మాత్రమే కాదు, మానవత్వాన్ని మరిచే స్థితి,‘ అని అన్నారు. ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి ఉన్నదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ‘ప్రతి ఒక్కరూ బాధ్యతగా మత్తుపదార్థాలను తిరస్కరించి, డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేయాలి‘ అంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ శాఖకు, కార్యక్రమ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. డ్రగ్స్ వంటి ముప్పుల నుంచి సమాజాన్ని రక్షించాలంటే, ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు.

# జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నా..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రయాణంలో తన అనుభవాలను సందేశం ద్వారా పంచుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వ్యోమగాములను పంపించి అక్కడ పలు ప్రయోగాలు చేయించడానికి అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్'.. నాసా, స్పేస్‌ఎక్స్, ఇస్రో, ఐరోపా అంతరిక్ష సంస్థ ఈఎస్‌ఏ భాగస్వామ్యంతో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. దీర్ఘకాలంపాటు చేపట్టే రోదసి యాత్రల్లో వ్యోమగాముల శారీరక మార్పులపై ప్రధానంగా ఈ మిషన్‌లో రిసెర్చ్ చేయనున్నారు. రోదసి యాత్రల సమయంలో కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై కలిగే ప్రభావం.. ఇలా 60కి పైగా శాస్త్రీయ ప్రయోగాలను చేయనున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రయోగానికి భారత వ్యోమగామి శుభాన్షు పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ మిషన్ కింద సూయజ్ టీ-11 వ్యోమనౌకలో భారత వ్యోమగామి రాకేశ్‌శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజులపాటు ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏండ్ల తర్వాత రోదసిలోకి వెళ్తున్న రెండో భారతీయుడిగా శుభాన్షు రికార్డు సృష్టిస్తున్నారు. ఐఎస్‌ఎస్‌లోకి వెళ్తున్న తొలి భారతీయుడు కూడా ఇతనే. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టి శుభాన్షు శుక్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా ఆయన ఘటన సాధించారు. ఆక్సియం-4 ఐఎస్ఎస్‌తో డాక్ అయింది. దాదాపు నెల రోజుల ఆలస్యం, అనేక వాయిదాల తర్వాత జూన్ 25న స్పేస్‌ఎక్స్ డ్రాగన్‌లట్ ఆక్సియం-4 విజయవంతంగా అంతరిక్షంలోకి బయలుదేరింది. ఇలా ఐఎస్-ఎస్ చేరుకున్న మొదటి భారతీయుడి రికార్డు కూడా శుభాన్షు శుక్లా ఖాతాలో చేరింది. 28 గంటలు ప్రయాణించిన డ్రాగన్ అంతరిక్ష నౌక ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్(ఐఎస్ఎస్)ను చేరుకుంది. భూమికి 418 కిలోమీటర్ల ఎత్తులో ఎగురుతూ, గంటకు 17,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఐఎస్-ఎస్ ని చేరుకోవ డానికి అంతరిక్ష నౌక అనేక విన్యాసాలు చేయాల్సి వచ్చింది. 60 కంటే ఎక్కువ సైన్స్ ఎక్సపరిమెంట్స్ నిర్వహిస్తారు. క్యాన్సర్ పరిశోధన, డీఎన్‌ఏ రిపేర్ వంటివి ఇందులో భాగంగా ఉన్నాయి. భారత్ నుంచి శుభాన్షుతో పాటు పోలాండ్‌కు చెందిన స్లావోజ్ ఉజ్నాన్స్కీ-విస్నియెవ్స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు అమెరికాకు చెందిన కమాండర్ పెగ్గీ విట్సన్ ఈ వ్యోమనౌక ద్వారా ఐఎస్ఎస్ చేరుకు న్నారు. మిషన్ పైలట్ అయిన శుక్లా, అంతరిక్షంలోక వెళ్లిన రెండో భారతీయుడిగా హిస్టరీ క్రియేట్ చేశారు. అంతకుముందు 1984లో వింగ్ కమాండర్ రాకేశ్ శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లారు. దాదాపుగా 4 దశాబ్దాల తర్వాత మరో భారతీయులు స్పేస్‌లోకి ప్రవేశించారు.

# ఆదివాసీల హక్కుల బాధ్యత మంత్రి సీతక్కదే

- అణచివేత నుంచి వారిని కాపాడాలి
- మావోయిస్ట్ అధికార ప్రతినిధి జగన్ ప్రకటన

**ములుగు,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక లేఖలో పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అధికారులు, పోలీసులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రజలను అరెస్టులు, కేసుల బెదిరింపులతో గూడేలను ఖాళీ చేయించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ బిడ్డ, మాజీ నక్సలైట్‌గా ప్రాచుర్యంలో ఉన్న సీతక్క సొంత నియోజకవర్గంలో ఈ విధంగా జరగడం సిగ్గుచేటు, అవమానకరమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ధనసరి అనసూయ ఎందుకు ఆదివాసీల గురించి మాట్లాడడం లేదనేది అందరూ మాట్లాడుకుంటున్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌పై, 1996లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన పీసా చట్టంపై, 2006లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఎఫ్ఆర్‌ఏ, 1/70 చట్టాన్ని సీతక్క మరచిపోయిందా.. అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఆదివాసీలు, భారత రాజ్యాంగం గురించి పదే పదే మాట్లాడుతున్నది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు అర్థం కావడం లేదా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, బుద్ధిజీవులు కొన్ని వేల సంవత్సరాలుగా ఈ దేశ సందపను కాపాడుతున్న ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలను కాపాడుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు.

# నగరంలో ఆషాఢ బోనాల సందడి

## - గోల్కొండలో తొలిబోనం సమర్పించిన కవిత



**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆషాఢ మాసం బోనాలు భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తొలి బోనంతో బోనాల సందడి ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నగరంలో సందడి మొదలయ్యింది. ఈ క్రమంలో గోల్కొండ జగదాంబిక మహంకాళి, ఎల్లమ్మ తల్లికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కవిత పేర్కొన్నారు.

# నిజామాబాద్ పసుపు బోర్డు రైతులకు గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

లోగోను ఆవిష్కరించారు. 29న పసుపు బోర్డు ఆఫీస్ ను హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని, పలు రాష్ట్రాలు కోరినా కేంద్రం నిజామాబాద్ కే బోర్డు కేటాయించిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై సిబిఐతో విచారణ జరిపించాలని, ట్యాపింగ్ చేసింది పోలీసులే కాబట్టి సిబిఐ కి అప్పగించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ తో సిఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. పోలీసులపై పోలీసులే దర్యాప్తు జరిపే పరిస్థితి వచ్చిందని కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా అమిత్ షా రాక సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపి ధర్మపురి అర్వింద్, స్థానిక నేతలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

# ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోల మృతి

(మొదటి పేజీ తరువాయి)

నారాయణపుర్, కొండగావ్ ఎస్టీఎఫ్(స్టేట్ టాస్క్ ఫోర్స్) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. బుధవారం సాయంత్రం నుంచి జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళామావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒక ఇన్సాస్ రైఫిల్, ఆయుధంతో పాటు వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# మరో మూడేళ్లు సిఎం రేవంత్ రెడ్డే


- ఆ తరవాత ఛాన్స్ కోసం నేను ప్రయత్నిస్తా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మరోమూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.



# చైతన్య పేరుతో మోసం

**• శ్రీ కాకతీయ స్కూల్‌కు నోటీసులు**



**హుజురాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్‌లోని శ్రీ కాకతీయ హైస్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. శ్రీ కాకతీయ హైస్కూల్ పేరుతో అనుమతులు పొంది, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ పేరుతో ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రభుత్వ అధికారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలపై ఈ ఆదేశాలు వెలువడ్డాయి. మండల విద్యా వనరుల కేంద్రం (MRC) నుండి అందిన సమాచారం ప్రకారం, శ్రీ కాకతీయ హైస్కూల్ తమ పాఠశాల బస్సులపైన, విద్యార్థుల బెల్టులపైన, ఐడి కార్డులపైన, ఫీజు రసీదులపైన, విద్యార్థుల పుస్తకాలపైన "శ్రీ చైతన్య టెక్నో స్కూల్" పేరును ముద్రించి ప్రచారం చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. అక్షరాస్యులైన, నిరక్షరాస్యులైన తల్లిదండ్రులను, ప్రభుత్వ అధికారులను మోసగించడానికి ఈ విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ పేరుతో భౌతిక, వాణిజ్య మీడియా, ప్రసార మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేస్తున్నట్లు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుండి ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులు మరియు తగిన ఆధారాలను పరిశీలించిన మీదట, శ్రీ కాకతీయ హైస్కూల్‌పై ఎందుకు చర్యలు తీసుకోరాదో కారణాలతో సహా రెండు రోజులలోగా వివరణ ఇవ్వాలని మండల విద్యాధికారి కార్యాలయం ఆదేశించింది.

# డ్రగ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన

**• విద్యార్థులకు బహుమతుల ప్రదానం**






**హుజురాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు బానిసలై చెడుమార్గంలో పయనిస్తున్న ప్రస్తుత తరుణంలో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం ఆదేశాల మేరకు హుజూరాబాద్ టౌన్ సీఐ కరుణాకర్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎస్సే రైటింగ్ పోటీని నిర్వహించారు. హుజూరాబాద్ మండలంలోని హుజూరాబాద్ గర్ల్స్ హైస్కూల్ మరియు చెల్పూర్ హైస్కూల్ విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ ఎస్సే రైటింగ్ పోటీలో విజేతలకు కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కరీంనగర్ కలెక్టర్ మరియు కమీషనర్ ఆఫ్ పోలీస్ కరీంనగర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి: ఎల్. లక్ష్మీ ప్రసన్న (హుజూరాబాద్ జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్) ద్వితీయ బహుమతి: గట్టు హరిణి (చెల్పూర్ హైస్కూల్, రాంపూర్) తృతీయ బహుమతి: ఏదులాపురం శృతి (చెల్పూర్ హైస్కూల్,)ఈ సందర్భంగా హుజూరాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ కరుణాకర్ విజేతలను అభినందించారు. విద్యార్థుల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన పెంపొం దించడానికి ఈ కార్యక్రమం ఎంత గానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు.

# పోచంపల్లి, పెద్దవంగర గ్రామంలో పల్లెబాట కార్యక్రమం

**• పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి**



**తొర్రూర్ ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గంలోని పెద్దవంగర మండలంలో గల పోచంపల్లి, పెద్దవంగర గ్రామాలలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి గురువారం పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై, వారి జీవన పరిస్థితులు, అవసరాలు, సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు తాగునీటి సమస్య, పింఛన్లు, రోడ్ల పరిస్థితులు, ఆరోగ్య సదుపాయాలపై తమ అభ్యర్థనలు వివరించారు. ఈ సందర్భంగా ఝాన్సి రాజేందర్ రెడ్డి ప్రసంగిస్తూ పోచంపల్లి, పెద్దవంగర గ్రామాలను అభివృద్ధి చేయడానికి మీరు చూపిస్తున్న ఆదరణ, విశ్వాసం నా బాధ్యతను పెంచింది. ఈ గ్రామాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో అన్ని విధాల అభివృద్ధి చేస్తాం అని అన్నారు. రహదారులు, నీటి సౌకర్యాలు, ఆరోగ్య కేంద్రం వంటి మౌలిక వసతులపై కృషి కొనసాగుతుంది. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకోవాలి. మనకు అభివృద్ధి కావాలంటే మన పార్టీకి ఓటు వేయాలి. నేడు మీరు చూపిన ప్రేమను రేపు ఓటుగా మార్చాలి కోరారు. ఈ పల్లెబాట ద్వారా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడమే లక్ష్యం. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి మా నాయకత్వం నిరంతరం శ్రమిస్తోంది. ప్రతి ఒక్క కుటుంబం అభివృద్ధి పథంలో నడవాలి అనేది మా పార్టీ సంకల్పం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాలు, యువత, స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు. పల్లెబాట పర్యటన ప్రజల ఉత్సాహంతో విజయవంతంగా ముగిసింది.



# మా రోడ్డు చూడండి సారూ...

**• గ్రామ ప్రజల ఆవేదన**







**ఖానాపూరం, జూన్ 26 (పీసీడబ్ల్యూ న్యూస్):** వేపచెట్టుతండ గ్రామపంచాయతీలోని గుగులోతు రాజు కిరాణం దగ్గర రోడ్డుకు వర్షపు నీరు నిలిచి రేవతండకు స్కూల్ వ్యాను పోకుండా విద్యార్థులు మరియు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోనిఅ రోడ్డు బాగు చేయాలని కోరారు. అలాగే కోటిపల్లి తండాలో బానోతు వెంకట్రాం ఇంటి వద్ద వర్షం నీళ్లు ఎక్కువై ఇంట్లోకి చేరిన నీరు ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు ఎమ్మెల్యే సార్ మా రోడ్డు చూడండి, మా బతుకులు ఇంతేనా మమ్ములను పట్టించుకోరా అని మొరపెట్టుకున్న గ్రామ ప్రజలు, గ్రామంలో పడగేసిన పారిశుభ్రత పట్టించుకునే నాధుడే లేరు ఎప్పటికైనా సంబందించిన అధికారులు పట్టించుకొని మా రోడ్డు బాగు చేయాలని గ్రామ ప్రజలు కోరారు. అలాగే వేప చెట్టు తండా లో సైడు కాలువల స్థలం ఆక్రమించుకున్న వారిని పై చర్యలు తీసుకోవాలన్నారు.

# తొర్రూరులో మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీ

**• నిర్వహించిన తొర్రూరు డి.ఎస్.పి కృష్ణ కిషోర్**






**తొర్రూరు ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యు న్యూస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా మహబూబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ విగ్రహం ద్వారా బస్టాండ్కు చేరుకొని మా దగ్గర నిర్మూలన కొరకు వారికి ప్రతిజ్ఞ చేయించారు డిఎస్పి కృష్ణ కిషోర్. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సన్మార్గంలో నడవాలని తొర్రూరు డీ ఎస్పీ క్రిష్ణ కిషోర్ యువతకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయం మాధికద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో మాధక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన ర్యాలీ ని తొర్రూరు డీఎస్పీ కిష్ణ కిషోర్ ప్రారంభించారు .ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తులో చిత్తవుతున్నారని... మాదకద్రవ్యాలనువిక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా 1908 గాని పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని మాదకద్రవ్యాల అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన పెంపొందించేందుకు పోలీసులు పలు అవగాహన కర్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ర్యాలీలోసబ్ డివిజన్లోని, సీ.ఐ లు. పోలీస్ సిబ్బంది, పలు శాఖల అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# తొర్రూరు మున్సిపల్ నూతన కమిషనర్ వక్కాల శ్యాంసుందర్

**• గురువారం పదవి బాధ్యత స్వీకరించారు**

**• మున్సిపల్ ఉద్యోగులు సాదరంగా స్వాగతం పలికారు**

**తొర్రూరు ప్రతినిధి,జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా మందమర్రి మున్సిపల్ కార్యాలయం నుండి పదోన్నతి పై తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన వక్కాల శ్యాంసుందర్. తొర్రూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులు ఆధారంగా స్వాగతం పలికి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ నూతన కమిషనర్ వక్కాల శ్యాంసుందర్ ప్రసంగిస్తూ గతంలో మంచిర్యాల జిల్లా మందమర్రిలో శానిటరీ ఇనస్పెక్టర్ గా విధులు నిర్వహించానని పదోన్నతిలో భాగంగా తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ గా ప్రమోషన్ రావడం తో ఎంతోసంతోషంగా ఉందన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని పట్టణ ప్రజలు కూడా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సమర?నం. సానిటరీ ఇన్స్పెక్టర్ కొమ్ము దేవేందర్. వార్డ్ ఆఫీసర్లు పట్టాభి. ప్రభాకర్. కనకరాజు. బిల్ కలెక్టర్ లు వెంకట్రాం శంకర్. .మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆర్యవైశ్య మహాసభ వివాహ పరిచయ వేదిక కమిటీ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నిక



**గంగాధర, జూన్ 26 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ వివాహ పరిచయ వేదిక కమిటీ చైర్మన్ గా తోడుపునూరు తిరుపతి గారికి అధ్యక్షులు శ్రీ కన్న కృష్ణ నియామక పత్రం అందజేశారు ఇందులో ప్రధాన కార్యదర్శి కొమరవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాసు మరియు సభ్యులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో డయేరియా నివారణ అవగాహన శిబిరం



**హుజురాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** డయేరియా వ్యాధి నివారణ, నిరోధక చర్యలపై ఈరోజు హుజూరాబాద్‌లోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మధు మాట్లాడుతూ, డయేరియాను నివారించ డానికి కలుషితం లేని నీటిని త్రాగడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించ డం అత్యవసరమని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా డయేరియా వ్యాధికి సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఈ శిబిరంలో డాక్టర్ మధుతో పాటు డాక్టర్ జరీనా, మండల తహసిల్దార్ కనకయ్య, ఎంపీడీఓ సతీష్ కుమార్, మున్సిపల్ అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో డయేరియా నివారణ పట్ల అవగాహన పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నారు.

# గురుకుల బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

Anti Gravity · Above Infinity

Social Welfare Residential Educational Institutions Society of Telangana-TSWREIS

**పరకాల, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. బెల్లంపల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పీజీటీ ఇంగ్లీష్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని తెలిపారు ఈ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు ఎంఏ ఇంగ్లీష్, బీఈడీకి సంబంధించిన ధ్రువ పత్రాలను తీసుకొని జూన్ 30 మధ్యాహ్నం రెండు గంటలకు బెల్లంపల్లి బాలికల పాఠశాలకు హాజరు కావాల్సిందిగా కోరుతున్నాం. అడ్రస్ TGSWRS/JR (G) బెల్లంపల్లి, AR పోలీస్ హెడ్ కోటర్స్, శివాలయ రోడ్డు, బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా.

# పాముకాటుతో వృద్ధురాలు మృతి

**రామన్నపేట జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన గట్టు చంద్రమ్మ వయసు (75) ఈరోజు మధ్యాహ్నం గురువారం ఒంటిగంటకు ఇంటి పక్కన చెట్టుకు ఉన్న పాము కాటు వేయడం జరిగింది చుట్టుపక్కల వాళ్ళు చూసి చేతికి ర క్తం కారడం చూసి వెంటనే రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది ప్రధమ చికిత్స అనంతరం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పాము కాటు విషం ఎక్కువ కావడంతో మధ్యాహ్నం మూడు 35 నిమిషాలకు ఆమె నల్గొండ ప్రభుత్వాసుపత్రిలో కన్నుముశారు .గట్టు చంద్రమ్మ ప్రాణాలు విడిచింది డాక్టర్లు నిర్ధారణ చేశారు






## పరకాల ఎక్సైజ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు

**పరకాల, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పరకాల ఎక్సయిస్ స్టేషన్ పరిధిలోని దామెర మండలంలో గల CARE ఫార్మసీ కాలేజీ లో మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సయిస్ సిబ్బంది సీఐ తాతాజీ, SI జ్యోతి, సిబ్బంది లక్ష్మణ చారి, సమ్మయ్య, విజయ్ కుమార్ కేర్ ఫార్మసీ కాలేజీ : వైస్ ప్రిన్సిపాల్ రవికృష్ణ, అధ్యాపకులు శ్రీరమ్య, స్వాతి, కీర్తి,స్నిగ్ధ, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలో స్పోర్ట్స్ టీషర్ట్ల పంపిణీ



**చిట్యాల, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ విద్యా సంవత్సరం నూతనంగా జూకల్ ఉన్నత పాఠశాలలో చేరిన విద్యార్థుల కోసం, దాత శ్రీ మెరుగు రాజ్‌కుమార్ యాదవ్ సహృదయంగా 20 స్పోర్ట్స్ టీషర్ట్లు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల ప్రోత్సాహార్థం ఈ దానం అభినందనీయం.నిర్వహించిన కార్యక్రమంలో పలువురు గౌరవ అతిథులు హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. వీరిలో:మాజీ ఎం.పి.టి.సి. జంబుల తిరుపతి మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్ మాజీ ఉప సర్పంచ్ చాడ ఆనంద్ రెడ్డి.మాజీ ఎస్.ఎం.సి. చైర్మన్ దొంతి రాంరెడ్డి."చేయూత" స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మేదరి సునీల్ వార్డు సభ్యులు రేగురి కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన నాయకులను కలిసిన కాంటెస్టెడ్ ఎంపీ నీలం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ రోజు చిట్కుల్ క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలను, నాయకులను, కార్యకర్తలను కలిసి పలు విషయాలపై చర్చించాను పలువురు పలు శుభకార్యక్రమాలకు నన్ను ఆహ్వానించారు, నన్ను కలిసిన వారిలో సంగారెడ్డి నియోజకవర్గం సంగారెడ్డి పట్టణంలో తేదీ 29/06/2025 నాడు సంగారెడ్డి జిల్లా కుమ్మర్ల (శాలివాహన) సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల జాతర మహోత్సవానికి ఆహ్వానించిన కురుమ సంఘం సభ్యులు,కూకట్ పల్లి నియోజకవర్గం KPHB కాలనీలో 29/06/2025 నాడు కొలుముల సంతోష్ కుమార్ గారి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ కైతలాపూర్ ఎల్లమ్మ అమ్మవారి 5వ కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానించడం జరిగింది, పటాన్చెరు అమీన్పూర్ మున్సిపాలిటీ సుల్తాన్పూర్ గ్రామంలో మన్నే శివ నూతన షాప్ ఓపెనింగ్ కార్యక్రమానికి ఆహ్వానించారు.

# సమాజంలో మార్పు, చైతన్యం కోసం ఏబిజిపి...

- రాష్ట్ర కార్యదర్శి బి.చంద్రశేఖర్...



**కరీంనగర్,జూన్26(పీసీడబ్ల్యూ న్యూస్):** సమాజంలో మార్పు, చైతన్యం కోసం అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ నిరంతరం పనిచేస్తుందని ఏబి జి పి రాష్ట్ర కార్యదర్శి బి. చంద్రశేఖర్ తెలిపారు. ఏ బి జి పి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించా లన్నారు. నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అవగాహనా సదస్సులు నిర్వహించడం, సైబర్, క్రైమ్ ల పైన అవగాహనా పెంపొందించడానికి ఏ బి జి పి తగిన కార్యచరణలతో ముందు కొనసాగాలని తెలిపారు.బిరైతులకు విత్తనాలు, పేస్టిసైడ్స్ కొనుగోలు సమయంలో చూసుకోవాల్సిన అంశాలను తెలియపరచాలని సూచించారు. ఆన్లైన్ గేమింగ్ లపైన అవగాహనా సదస్సులు చేపట్టాలని, ప్రజలను చైతన్యం చేసే దిశగా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సమావేశంలో చర్చించారు. అనంతరం జూన్ 8వ తేదీన జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశ వివరాలు రాష్ట్ర కార్యదర్శి బి. చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమల్ల సురేష్, జిల్లా బాద్యులు నలువాల రాజేందర్,సురభి శ్రీధర్,సత్యనారాయణ రావు, హరి ప్రసాద్,తిప్పర్తి శ్రీనివాస్, రాజశేఖర్,మాణితేజ, అశోక్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# మేదరి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు..



**కరీంనగర్ టౌన్ జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా మేదర సంఘం అధ్యక్షులు మధిర రవీందర్ అధ్యక్షతన జిల్లాస్థాయి మేదరి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించేందుకు అలాగే ఇటీవల ఉద్యోగాలలో చేరిన మేదరి బంధువులకు మరియు పదవి విరమణ చేసిన ఉద్యోగులకు ఘన సన్మానము చేయుటకు ప్రత్యేక కార్యక్రమం ఈనెల 29వ తేదీన ఆదివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించబడునున్నది, ఈ వేడుక కరీంనగర్ రేకుర్తిలోని సంఘ భవనంలో జరగనున్నది, ఈ కార్యక్రమం కరీంనగర్ జిల్లా మేదరి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మరియు కరీంనగర్ నగర మేదర సంఘం సహకారంతో జరుగుతుంది. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేకంగా ఈ అవార్డులు అందించుచున్నారని కరీంనగర్ జిల్లా మేదర సంఘం అధ్యక్షులు మధిర రవీందర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వలపరెడ్డి లచ్చయ్య రాష్ట్ర ఉపాధ్యక్షు మరియు జిల్లా అధ్యక్షులు ఏకుల రాజనర్స్ కరీంనగర్ జిల్లా నగర అధ్యక్షుడు ఏకుల రమేష్ గార్లము ఒక ప్రకటనలో తెలియజేశారు, ఇట్టి కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా ఎకుల బాంధవులు సహకరించి విజయవంతం చేయగలరని అన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాలపై విద్యార్థి సంఘాల వార్నింగ్: 'జెండాలు వేరైనా ఎజెండా ఒక్కటే'



**హుజురాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న పుస్తకాల విక్రయాలు, అధిక ఫీజుల వసూళ్లపై విద్యార్థి, యువజన సంఘాలు భగ్గుమన్నాయి. హుజురాబాద్ పట్టణంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో, పాఠశాలల ఆవరణలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే సహించేది లేదని, అవసరమైతే భౌతిక దాడులకైనా వెనుకాడబోమని తీవ్రంగా హెచ్చరించాయి.విద్యను వ్యాపారంగా మార్చి, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలల తీరును నాయకులు తప్పుబట్టారు. ప్రైవేటు విద్యా సంస్థల ఇష్టానుసార వసూళ్లను విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, వారికి కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు."పాఠశాలల యాజమాన్యం, విద్యాశాఖ అధికారులు తమ తీరు మార్చుకోకపోతే, అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతాం" అని నాయకులు స్పష్టం చేశారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు టేకుల శ్రావణ్, కొలుగూరి సూర్యకిరణ్, పర్లపల్లి నాగరాజు, కర్ర శ్రీధర్ రెడ్డి, పంజాల రేవంత్, గండు ప్రశాంత్ యాదవ్, ఆలేటి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చేరికలకు ఆహ్వానం.... తలుపులు తెరిచిన ఎంఐఎం

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చేరికలకు గ్రీన్ సిగ్నల్ అధినేత ఓవైసీ
- స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల వరకు ఎంఐఎంను బలోపేతం చేయాలి
- గులాం అహ్మద్ హుస్సేన్‌కు ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఆదేశం



**కరీంనగర్ టౌన్, జూన్26(పీసీడబ్ల్యూ న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, ఎంఐఎం పార్టీని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంస్థాగతంగా బలోపేతం చేయడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సంస్థాగతంగా నిర్మాణ పరంగా బలోపేతం చేయాలని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ను ఆదేశించారు. గురువారం ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీని హైదరాబాద్లోని ఎంఐఎం పార్టీ జాతీయ కార్యాలయం దారుస్సలామ్ లో గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం పార్టీ నగర సహాయ కార్యదర్శి హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ పార్టీల నుండి చేరబోయే వారిని ఎంఐఎం పార్టీలోకి ఆహ్వానించాలని ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, పెద్దపల్లి, గోదావరిఖని, రామగుండం, సిరిసిల్ల, హుజురాబాద్, జమ్మికుంట, వేములవాడ, కరీంనగర్ మున్సిపల్ పరిధిలో విస్తృతంగా చేరికల కార్యక్రమాన్ని చేపట్టాలని, తమ అధినేత ఓవైసీ స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారని, గులాం అహ్మద్ వివరించారు. ఇతర పార్టీల నుండి చేరేవారికి ఎంఐఎం లో తలుపులు తెరిచి ఉన్నాయన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని సెక్యులర్ నాయకులతోపాటు ఎస్సీ ఎస్టీ, బీసీ నాయకులను సైతం ఎంఐఎం లో చేరికలకు ఆహ్వానం ఉంటుందని సామాజిక న్యాయమే లక్ష్యంగా అన్ని వర్గాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని మున్సిపల్ ఏరియాల్లో పర్యటించి ఎంఐఎం లో చేరబోయే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. జిల్లాలో నిర్ణయాత్మక శక్తిగా ఎంఐఎం ను బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని తమ అధినేత ఆదేశించినట్లు తెలిపారు.

## ఒడిస్సాలో దళితులపై దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ...

- పెద్దపల్లి ఎంపీ కార్యాలయం...





**పెద్దపల్లి జిల్లా,జూన్26(పీసీడబ్ల్యూ న్యూస్):** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఈరోజు ఒడిస్సా రాష్ట్ర గంజాం జిల్లాలోని గంగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగపూర్ గ్రామంలో ఇటీవల ఇద్దరు దళితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను ఆయన వ్యక్తిగతంగా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరగాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒడిస్సా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు."ఇలాంటి అఘాయిత్యాలు 21వ శతాబ్దంలో దళితులపై ఇంకా కొనసాగుతుండటం దురదృష్టకరం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయి. ఇది చట్ట పాలనపై మచ్చుబారేలా చేస్తోంది. కేంద్రం, రాష్ట్రం కలసి తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన దళిత సంఘాల నాయకులతో సమావేశమై, భవిష్యత్ చట్టపరమైన పోరాటాలకు మద్దతు ప్రకటించారు.

## మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు మాదిగ సామాజిక వర్గం సన్మానం, భారీ బైక్ ర్యాలీ

**హుజురాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా మంత్రి పదవి చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అభినందనలు తెలుపుతూ జూన్ 29 ఆదివారం నాడు మాదిగ మేధావుల ఆధ్వర్యంలో సన్మాన మహోత్సవం జరగనుంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, ఇతర ఆరుగురు మాదిగ శాసనసభ్యులకు కూడా సన్మానం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తోంది.ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఆవరణ నుండి భారీ బైక్ ర్యాలీ ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరణ కూడా జరిగింది. ఈ సన్మాన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మాదిగ మిత్రులు, మేధావులు, మహిళా సోదరీమణులు, విద్యావంతులు, కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మోదుగుపల్లి మల్లేశం, వేల్పుల రత్నం, ఎర్ర శ్రీనివాస్,ముక్క రమేష్ సహా పలువురు మాదిగ నాయకులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేను కలిసిన బొల్లారం మున్సిపల్ కమిషనర్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గం బొల్లారం మున్సిపల్ కమిషనర్ గా ఇటీవల బదిలీపై వచ్చిన కిషన్ గురువారం ఉదయం పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మినీ ఇండియాగా పేరుందిన బొల్లారం మున్సిపల్ పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.



# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలకు భూమి కేటాయింపులు చేయండి

● జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** పటాన్చెరు నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్యను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం సాయంత్రం సంగారెడ్డి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు.వివిధ అంశాలపై కలెక్టర్ తో చర్చించారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇటీవల 200 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. స్కూల్ ఏర్పాటు కోసం పటాన్చెరు



రెవెన్యూ పరిధిలోని పోచారం గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 69లో 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తోపాటు పాలిటెక్నిక్ కళాశాలకు శాశ్వత భవనం కోసం ఇదే సర్వే నంబర్ లో భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాల తరగతుల కోసం తాత్కాలిక ప్రాతిపదికన పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం లోపు భవన నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం ప్రభుత్వం ఇప్పటికే 200 కోట్ల రూపాయలు నిధులు కేటాయించడంతో భూమి కేటాయించిన వెంటనే పనులు ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రావిణ్య త్వరలోనే భూమి కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్



**యాదాద్రి జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని పలు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. తుక్కాపురం,కూరెళ్ల, పుల్లాయిగూడెం, ఖప్రాయపల్లి, రాఘవాపురం, దుప్పల్లి, నర్సాపురం గ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు, లింగరాజుపల్లీ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థానలు చేశారు. ఖప్రాయపల్లి గ్రామంలో వాటర్ ఫిల్టర్ ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నిషేధిత పురుగుల మందుల విక్రయంపై కఠిన చర్యలు

● సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత హెచ్చరిక

**హుజురాబాద్, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నిషేధిత పురుగుల మందులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత హెచ్చరించారు. గురువారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలంలోని కందుగుల, చిల్పూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, వానాకాలం సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నిల్వలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీలర్లకు వివరించారు. కాలం చెల్లిన విత్తనాలు, కాలం చెల్లిన పురుగుల మందులు, అలాగే నిషేధిత పురుగుల మందులను విక్రయించవద్దని ఆమె స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.దుకాణదారులు తమ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్లను రోజువారీగా రాయాలని సునీత సూచించారు. షాపు మెయిన్ బోర్డుపై డోర్ నంబర్, లైసెన్స్ వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని, లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయకూడదని ఆమె ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి భూమి రెడ్డి కూడా పాల్గొన్నారు.

## ఒక మాట చెప్పగానే ఉద్యమానికి పూనుకొని రైతుల పక్షాన పోరాడిన రైతు బాంధవుడు: మా తన్నీరు హరీష్ రావు





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** జిన్నారం మండల కేంద్రంలో జరిగిన రైతు భరోసా మహా ధర్నాకుఒక్క పిలుపుతో వచ్చి, రైతుల న్యాయ సమరానికి అండగా నిలిచినమాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు. పటాన్చెరు నియోజకవర్గం రైతుల మనసు గెలిచారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యేందుకు కృషి చేసిన.హరీష్ కి పటాన్‌చెరు నియోజకవర్గం తరపున మా హృదయపూర్వక కృతజ్ఞతలు.ఈ కార్యక్రమంలో హరీష్ అన్నను మర్యాదపూర్వకంగా కలిసి, ధన్యవాదాలు తెలిపిన.పటాన్‌చెరు నియోజకవర్గ రైతులు మరియు బీఆర్ఎస్ నాయకులు. నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్. కొలను బాల్ రెడ్డి.సోమిరెడ్డి. గోవర్ధన్ రెడ్డి. వెంకటేశం గౌడ్. రాములు గౌడ్. తొంట అంజయ్య యాదవ్. రాజేష్. ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.ఈ మహా పోరాటంలో భాగమై, రైతులకు అండగా నిలిచిన హరీష్ కి ప్రత్యేక ధన్యవాదాలు.ఈ కార్యక్రమంలో ఐలాపూర్ మాణిక్ యాదవ్‌బీఆర్ఎస్ నాయకులు.అమీన్పూర్ మున్సిపాలిటీ, పటాన్‌చెరు నియోజకవర్గం.

## సాయిగూడెం పాల సంఘం చైర్మన్గా ఊదరి రాములు



**యాదాద్రి జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సాయిగూడెం గ్రామంలో పాల సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్గా ఊదరి రాములు ఎన్నిక కాగా డైరెక్టర్లుగా కొండ చంద్రారెడ్డి, గంగాధరి రాజులను ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు కొమ్మిడి లక్ష్మారెడ్డి, బీజని బాలరాజ్, బీజని సత్తయ్య, భేతి వెంకట్ రెడ్డి, బొడ్డు అయిలయ్య, బేతి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్లో చేరిక



**యాదాద్రి జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గురువారం ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధి పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. చుంచు వీరస్వామి, చుంచు అంజయ్య, చుంచు అనిత, పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రత వారోత్సవాలు కార్యక్రమం: మండల ఏఈ పాండు



**నరసింహుల పేట జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** నరసింహుల పేట మండల కేంద్రంలో విద్యుత్ శాఖ వారి ఆధ్వర్యంలో విద్యుత్ భద్రత వారోత్సవాలు కార్యక్రమం నరసింహుల పేట ఎస్సీ కాలనీలో లో నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మండల ఏ ఈ పాండు మాట్లాడుతూ కాలనీవాసులకు విద్యుత్ ప్రమాదాల గురించి మరియు భద్రతల గురించి వివరిస్తూ మీ యొక్క ఇంటి పరిసరాలలో బట్టలు ఆరవేయడానికి జిఐ వైరు వాడరాదు అలాగే పంట పొలాల వద్ద ప్రమాదకరంగా ఉన్న లైన్లు మరియు కరెంటు ప్రవహించే ఎటువంటి వైరు (లైన్) తెగిపడిన అలాగే ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఫీజులు పోయిన మీ విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగలరు మీరు నేరుగా వేసినచో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది కనుక ఎటువంటి అంతరాయం కలిగిన మీరు మరమ్మత్తులు చేయకుండా మీ దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగలరని విద్యుత్ శాఖ వారు ఎస్సీ కాలనీ వాసులకు విద్యుత్ ప్రమాదాల నివారణ కొరకు **రైతులకు సూచనలు** రైతులు, వినియోగదారులు స్వయంగా చిన్న మరియు పెద్ద కరెంట్ పనులను సొంతంగా చేసుకొని నిండు ప్రాణాలు కోల్పుతున్నారని, చాల బాధాకరమని , అర్హత కలిగిన ఎలెక్ట్రిషియన్ తో పనులు చేసుకోగలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ కంచె ల వలన రైతులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి . కావున రైతులు అప్రమతంగా ఉండాలని , ఎవరైనా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని కోరుతున్నాము. విద్యుత్ కంచె ఏర్పాటు చేయడం చట్ట రీత్యా నేరం అని ఆయా రైతులకు తెలుపగలరు. విద్యుత్ సిబ్బంది చేయదగిన పనులు అనగా, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద అధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరుచేయడం, ఎబి స్విచ్లు ఆపరేట్ చేయడం మరియు కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం. వ్యవసాయ మోటార్లకు మరియు గృహాలలో నాణ్యత గల,అతుకులు (joints) లేని సర్వీసు వైరును మాత్రమే ఉప యోగించండి.గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్ర స్థాయి విద్యుత్ సిబ్బంది లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇంజనీర్ , సెక్షన్ ఆఫీసర్ గార్లను సంప్రదించి వారి సేవలను పొందండి. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తిన TGNPDCL టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సహకరించగలరని విద్యుత్ వినియోగదారులను కోరారు ఇట్టి కార్యక్రమంలో , లైన్మెన్ చలమయ్య ఏ ఎల్ ఎం సుధాకర్ ఏఎల్ఎం అశోక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

## పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎమ్ఆర్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి దత్తాత్రేయ నగర్ కాలనీలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో 2 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించిన శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు.



## ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా

**యాదాద్రి జూన్ 26(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా తాడ్వాయి మండల ఆంధ్రజ్యోతి విలేకరి చల్లకొండ శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానుర్ బాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరమని అన్నారు.రోజురోజుకు జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల రక్షణ కోసం రక్షణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కోరారు. టీజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, రాష్ట్ర నాయకులు సుక్క అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు రషీద్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల సమస్య !

స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టు లైన్ క్లీయర్ చేయడంతో పాటు, డెడ్‌లైన్ కూడా విధించింది. మరోవైపు 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేసే ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్, బిజెపి డిమాండ్ చేస్తున్నాయి. కులగణన చేసి చరిత్ర సృష్టించామని, మోడీకి సవాల్ విసిరామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసి రిజర్వేషన్ల అమలు అంత సులువు కాదు. స్థానిక ఎన్నికల్లో ఎలా అమలు చేస్తారన్నదానికి అసలు ప్రణాళిక ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. కేంద్రం దీనికి ఆమోదం తెలిపితేనే ముందుకు సాగం సాధ్యం అవుతుంది. ఎన్నికలను 3 నెలల్‌ఓగా పూర్తి చేయాలని హైకోర్డు గడువు విధించడంతో బీసీ రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర సర్కారు కసరత్త చేయాల్సి ఉంది. ఎలా చేస్తే అడుగు ముందుకు పడుతుందో ఇప్పుడు సవాల్ కానుంది. కేంద్రాన్ని తిడుతూ పోతే సమస్య పరిష్కారం కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ఉభయ సభల్లో ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదం కోసం ఇప్పటికే పంపించింది. ప్రస్తుతం ఈ రెండు బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఆమోదింప చేయాలని ఢిల్లీలో ధర్నా కూడా నిర్వహించారు. కిషన్‌రెడ్డి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. అయితే బిసి కులగణన అంతా తప్పుల తడకగా ఉందని బిజెపి వాదిస్తోంది. మరోవైపు కేంద్రం చేసే గణనకే చట్టబద్దత ఉంటుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చి న హామీ మేరకు లేదా పదేపదే ప్రకటించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వమే 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశాన్ని ఎలా అమలు చేస్తారన్నది చూడాలి. ప్రస్తుతం ఎస్సీలకు 18, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటిస్తే మొత్తం రిజర్వేషన్లు 70 శాతం చేరే అవకాశం ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించరాదని ఇప్పటికే సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అందువల్ల ప్రభుత్వ నిర్ణయాన్ని ఎవరైనా కోర్టుల్లో సవాల్ చేస్తే మొత్తం ఎన్నికల పక్రియ నిలిచిపోయే ప్రమాదం ఉన్నది. అలాంటప్పుడు కేంద్రం అంగీకరించకుండా 42శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదు. అది కాకుంటే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కూడా సాధ్యం కావు. అందువల్ల పార్టీ పరంగా 42శాతం బిసి రిజర్వేషన్లు ఇస్తామనే ప్రకటన చేయడం మినహా మరోమార్గం లేదు. బిసి రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించి, 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా తమిళనాడుకు కల్పించినట్లే తమకు రక్షణ కల్పించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నది. కానీ కేంద్రం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి స్పందన రాలేదు. మరోవైపు ఎట్టి పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం మించరాదనే సుప్రీంకోర్టు తీర్పు ఉన్నది. దీంతో కోర్టు తీర్పులు, రాజ్యాంగ నిబంధనలులాంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును గత మార్చిలోనే అసెంబ్లీ అమోదించింది. కానీ బీసీ రిజర్వేషన్ల పెంపు రాష్ట్ర పరిధిలో తీసుకునే నిర్ణయం కాకపోవడంతో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ప్రస్తుతం ఇది రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిపై ఇప్పటివరకూ రాష్ట్రపతి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయంలో న్యాయ నిపుణులను సంప్రదించి, ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నట్లుగా




కనిపిస్తోంది. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తేవడంపైనా ప్రభుత్వం ఆలోచించాల్సి ఉంది. అయితే రాజ్యాంగ పరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తరవాతే రాష్ట్రపతి ఆఓదం తెలుపుతారు. కాబట్టి ఇలాంటి విషయాల్లో రాష్ట్రపతి కూడా న్యాయ సలహాకు పంపుతారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే జీవో ఇవ్వడం సాధ్యమువుతందా అన్న విషయం కూడా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఇలా చేయడం వల్ల వచ్చే న్యాయపరమైన చిక్కులపైనా ప్రభుత్వం ఆరా తీస్తున్నది. నిజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో అంటే ఈ మూడు నెలల్లో కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రాకపోవచ్చు. అందువల్ల పార్టీపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి.. ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమం. మరోవైపు హైకోర్టు తీర్పు తరవాత పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఎందుకంటే హైకోర్టు తీర్పు తర్వాత సీఎస్ రామకృష్ణారావును పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు కలిసి చర్చించారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులోని అంశాలను వివరించారు. రిజర్వేషన్లపై క్లారిటీ వస్తే.. వెంటనే ఎన్నికల పక్రియ ప్రారంభించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డికి సీఎస్ రామకృష్ణారావు వివరించినట్లు తెలిసింది. రిజర్వేషన్ల బిల్లుపై రాష్ట్రపతి నుంచి ఎలాంటి ఆమోదం రాకుంటే తమిళనాడు తరహాలో సుప్రీంకోర్టు మెట్లెక్కాలని కొందరు సూచించినట్లు సమాచారం. మరోవైపు తెలంగాణలో కులగణన, ఇక్కడి నుంచి వెళ్లిన రిజర్వేషన్ల బిల్లులపై కేంద్రం పెద్దగా స్పందించడం లేదు. సానుకూలతనూ వ్యక్తం చేయడం లేదు. ఈ నేపథ్యంలోనే కేంద్రం జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం లభిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. సమగ్ర కులగణన సర్వే వివరాలు, అసెంబ్లీలో ఆమోదం పొందిన బీసీ బిల్లు ఆధారంగా నేరుగా బీసీలకు నేరుగా 42 శాతం రిజర్వేషన్లను ప్రకటిస్తే వచ్చే న్యాయపరమైన చిక్కుల నేపథ్యంలో.. ప్రభుత్వం ఏం చేస్తుందన్న చర్చ సాగుతోంది. ఓ రకంగా ఇది అంత సులవైన విషయం కాదు. ప్రభుత్వ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది.

---

# విభజన చట్టం మేరకు పెరగని అసెంబ్లీ సీట్లు



- **పదేళ్లయినా నేటికీ అమలు కాని నిర్ణయం**
- **జనాభా లెక్కల తరవాతే డీలిమిటేషన్ ఛాన్స్**

**న్యూఢిల్లీ,జూన్26:** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి. ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. దీనిపైనా చంద్రబాబు ఒత్తిడి చేసే అవకాశం లేకపోలేదు. అయితే జనాభా గణన జరిగే వరకు వేచి చూస్తారని అంటున్నారు. జనభా లెక్కలు తేలాక ఎలాంటూ డీ లిమిటేషన్ జరగవచ్చని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతు న్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన పక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ పక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ పక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ పక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యనుకేటాయించాలని వారు వాదిస్తున్నారు.

---

# యుద్ధభూముల్లో జీవితపోరాటం

బాంబుల దాడులు, సైనిక బలగాల కవాతు విన్యాసాలు, సైరన్ల హెచ్చరికలు, నగరాల విధ్వంసాలు.. ఇలాంటి అత్యంత భయానక వాతావరణంలోనూ తమ జీవనపోరాటం కోసం ఆరోగ్య సంరక్షకులుగా, నిర్మాణాల కూలీలుగా, తాపీ మేస్త్రీలుగా, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్లుగా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ఎందరో భారతీయులు గత కొన్నేళ్లుగా మనుగడ సాగిస్తున్నారు. అక్కడి యూనివర్శిటీల్లోనూ ఎందరో భారతీయ విద్యార్థులు చదువుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ఇరాన్ దేశాల మధ్య కొన్ని రోజులపాటు యుద్ధం బీభత్సంగా సాగింది. ప్రవాస భారతీయులను స్వదేశానికి రప్పించాలన్న బాధ్యతతో భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధు పేరుతో అక్కడి భారతీయులను తరలించడం ప్రారంభించింది. పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్ వాసులకు కూడా ఆపరేషన్ సింధు సహకరిస్తోంది. ఇప్పటివరకు ఇరాన్ నుంచి 2858 మందిని, ఇజ్రాయెల్ నుంచి 818 మందిని కేంద్ర ప్రభుత్వం రప్పించ గలగడం హర్షించదగిన చొరవే. అయితే గత కొన్నేళ్లుగా ఆ దేశాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాలు చేస్తూ బతుకుతున్న వారు మాత్రం తిరిగి భారత్‌కు రావడానికి ఇష్టపడడం లేదు. దేశాల యుద్ధం కన్నా తమ జీవన పోరాటం ముఖ్యమన్న అభిప్రాయం వారిలో కనిపిస్తోంది. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక అభివృద్ధి దేశంగా ఎదుగుతున్న భారత్‌లో ప్రస్తుతం ఉంటున్న భారతీయుల్లో కొందరు ఆ దేశాలే తమ జీవనోపాధికి గమ్యస్థానాలన్న ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. భారత ప్రభుత్వానికి ఇదో పెద్ద సవాలు. దేశంలో పౌరుల భద్రతకు ఢోకా లేదని, ఇతరత్రా సహకారం లభిస్తుందన్న కేంద్ర ప్రభుత్వ హామీలు ఉంటున్నా దాని ప్రభావం ఎంతవరకు పనిచేస్తుందో ప్రశ్నార్థకం. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ప్రస్తుతం ఉంటున్న భారతీయుల్లో కేవలం 10 నుంచి 12 శాతం మంది మాత్రమే స్వదేశం భారత్‌కు తిరిగి వస్తున్నారని ఇజ్రాయెల్ లోని ప్రవాస భారతీయ ప్రతినిధులు చెబుతున్నారు. ఇజ్రాయెల్‌లో 15,000 మంది భారతీయులు ఆరోగ్య సంరక్షకులుగా ఉద్యోగాలు చేస్తున్నారు. వీరిలో చాలామంది తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు చెందినవారే. ఇజ్రాయెల్‌లో తెలంగాణ ఆరోగ్య సంరక్షకులు నెలకు రూ. 1,50,000 వరకు సంపాదిస్తున్నారు. ఆహారం, వసతి తదితర



సౌకర్యాలు వీరికి ఉచితంగా లభిస్తున్నాయి. ఇటువంటి సౌకర్యాలు స్వదేశం భారత్‌లో తమకు లభిస్తాయా అన్న ప్రశ్న ఎదురవుతోంది. 'సంఘర్షణ అన్నది తమకు కొత్తేమీ కాదు. హమాస్, హెజ్బొల్లా, హౌతీస్ ఇలా ఎన్నో ఉగ్రవాద గ్రూపుల నుంచి నిత్యం తమకు సంఘర్షణలు ఎదురవుతూనే ఉన్నాయి. కానీ ఇజ్రాయెల్ ఐరన్‌డ్రోమ్ మమ్మల్ని నిత్యం రక్షిస్తోంది. స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, అపార్టుమెంట్లు ఇలా ప్రతిచోట భూగర్భ బంకర్లు ఉన్నాయి. అందువల్ల మా భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదు' అన్న నమ్మకం ప్రవాస భారతీయుల్లో కనిపిస్తోంది. ఇక విద్యార్థుల చదువుల విషయానికొస్తే ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో చదువులకయ్యే ఖర్చు భారత్‌తో పోలిస్తే చాలా తక్కువ. ఒక్క ఇరాన్‌లోనే 4000 మంది భారతీయ విద్యార్థులు చదువుకొంటున్నారు. వీరిలో సగానికి సగం మంది కశ్మీర్ విద్యార్థులే. భారత్‌లో ఎంబిబిఎస్ సీటు ప్రైవేట్ కాలేజీల్లో సంపాదించాలంటే రూ. కోటి వరకు ఖర్చు పెట్టవలసివస్తుంది. అదే ఇరాన్‌లో మొత్తం ఎంబిబిఎస్ కోర్సుకు రూ. 30 లక్షలు మాత్రమే ఖర్చవుతుంది. దీనికి కారణం ఇరాన్‌లో యూనివర్శిటీలకు అక్కడి ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోంది. 2023 లో భారత్ ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం ఫలితంగా నిర్మాణ రంగం, నర్సింగ్‌ల్లో భారత కార్మికుల కోటా పెరిగింది. నెలవారీ వేతనాలు రూ. లక్ష దాటాయి. దీనికి తోడు వైద్య బీమా వంటి సౌకర్యాలు లభిస్తున్నాయి. ఇటువంటి ప్రయోజనాలు భారత్‌లో లభిస్తాయని ఊహించడం కష్టమే. ఇదిలా ఉండగా యుద్ధం జరిగే ప్రాంతాల్లో ఉద్యోగాలు, వృత్తులు చేయడం ప్రాణాలతో చెలగాటం. కానీ దీనికి ప్రవాసీయులు భయపడడం లేదు. పైగా యుద్ధం జరిగే చోట పనులు చేస్తే తమకు ఎక్కువ ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. స్వదేశంలో లభించే ఆదాయం కన్నా ఏడాదిలో ఐదు రెట్లు ఆదాయం సంపాదించవచ్చని అంటున్నారు. యుద్ధాల బాధితులమని వారు ఆవేదన చెందడం లేదు. అలా తమను గుర్తించవద్దని స్పష్టం చేస్తున్నారు. ఇటువంటి ప్రవాస భారతీయుల్లో అనేక మంది ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన వారే కావడం గమనార్హం. స్వదేశంలో తమకు తగిన వేతనాలు ఎక్కువగా లభిస్తాయన్న ఆశ వారిలో కలగడం లేదు. అందుకే ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధోన్మాద దేశాలైనప్పటికీ, తమ బతుకులకు ఆసరా కల్పించే దేశాలన్న నమ్మకం వారిలో కనిపిస్తోంది. ఇక భారతీయులను తరలించే రిస్కు ఆపరేషన్లు కూడా వారికి కొత్తేమీ కాదు. 2023 ఏప్రిల్ మే నెలల్లో 3000 మంది కన్నా ఎక్కువ మంది భారతీయులు సూడాన్ నుంచి ఆపరేషన్ కావేరీ ద్వారా విమానాల్లో భారత్‌కు తరలి వచ్చారు. అంతకు ముందు 1990లో మొదటి గల్ఫ్ యుద్ధంలో భారతీ యులను తరలించడం జరిగింది. 2015 లో యెమెన్ నుంచి ఆపరేషన్ రాహత్ పేరున, అలాగే 2022లో ఉక్రెయిన్ నుంచి భారతీయ పౌరులను తరలించే ప్రయత్నాలు జరిగాయి. యుద్ధ భూముల్లో వ్యక్తిగత భద్రత కన్నా ఆర్థిక భద్రత, కుటుంబ సంక్షేమం ప్రాధాన్యాలుగా ఉంటున్నాయి. పొరుగున ఉన్న గాజా లో యుద్ధ భయానక సంఘటనలు, పౌరుల మరణాలు, విధ్వం సాలు ఎక్కువగా సాగుతున్నప్పటికీ, అవేవీ వీరు పట్టించు కోవ డం లేదు. యుద్ధవ్యూహాల కన్నా మనుగడ వ్యూహాలే ముఖ్యం అన్న లక్షంవీరినియుద్ధభయం లేకుండా ముందుకు నడిపిస్తోంది.

# సూర్యకుమార్ యాదవ్ సర్జరీ సక్సెస్




**● బంగ్లాదేశ్ టూర్‌కు దూరం కానున్న సూర్యకుమార్**

టీమిండియా క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్‌కు సర్జరీ పూర్తయింది. జర్మనీలో సూర్యకు స్పోర్ట్స్ హెర్నియాకు విజయవంతంగా సర్జరీ చేశారు డాక్టర్లు. దీని గురించి సూర్య కుమార్ యాదవ్ సోషల్ మీడియాలో ఆపరేషన్ తర్వాత ఒక ఫోటోను షేర్ చేస్తూ అప్‌డేట్ ఇచ్చాడు. 34 ఏళ్ల సూర్యకుమార్ యాదవ్ భారత క్రికెట్ జట్టుకు టీ20 కెప్టెన్‌గా సేవలు అందిస్తున్నాడు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత బీసీసీఐ సూర్యకు టీ20 సారథ్య బాధ్యతలు అప్పగించింది.సూర్యకుమార్ యాదవ్ తన సోషల్ మీడియా అకౌంట్లో ఓ ఫోటోను షేర్ చేస్తూ, "లైఫ్ అప్‌డేట్, పొత్తికడుపు కుడి దిగువ భాగంలో స్పోర్ట్స్ హెర్నియాకు సర్జరీ పూర్తయింది. సర్జరీ సక్సెస్. ఇప్పుడు నేను కోలుకుంటు న్నానని చెబుతున్నందుకు సంతోషంగా ఉంది. క్రికెట్ స్టేడయిం లోకి సాధ్యమైనంత త్వరగా తిరిగి రావడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని రాసుకొచ్చాడు. భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం ఇంగ్లండ్‌లో పర్యటిస్తోంది. 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు పూర్తయింది. దీని తర్వాత టీమిండియా ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనలో వన్డే సిరీస్ ఆడుతుంది, ఆ తర్వాత టీ20 సిరీస్ ఆడుతుంది. మొదటి టీ20 ఆగస్టు 26న, చివరి మ్యాచ్ ఆగస్టు 31న షెడ్యూల్ చేశారు. సూర్య కుమార్ యాదవ్ ఈ పర్యటనకు వెళ్లే అవకాశం కనిపించడం లేదు. స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ తర్వాత కోలుకోవడానికి 6 నుంచి 12 వారాల వరకు సమయం పడుతుంది. పూర్తి ఆరోగ్యంతో సూర్య మళ్లీ బ్యాట్ పట్టాలంటే మూడు నెలలు టైం పట్టేలా ఉంది. టీ20లో తరువాత మేజర్ ఈవెంట్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనుంది. భారత్, శ్రీలంకలో హైబ్రిడ్ మోడల్‌లో ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 ఫిబ్రవరి– మార్చిలో నిర్వహించనుంది. ఇందులో మొత్తం 20 జట్లు తలపడతాయి. ఈ పొట్టి ప్రపంచ కప్‌లో టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ వ్యవహరించ నున్నాడు. టీమిండియాకు లేటు వయసులో ఎంట్రీ ఇచ్చాడు. 30 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సూర్యకుమార్ యాదవ్ 1 టెస్ట్, 37 వన్డేలు, 83 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. వన్డేలు, టీ20లలో అతను 773 రన్స్, 2598 పరుగులు చేశాడు. వన్డేలలో సూర్య 4 హాఫ్ సెంచరీలు సాధించాడు. వన్డే ఫార్మాట్లో ఒక్క సెంచరీ లేని సూర్య టీ20ల విషయానికి వస్తే ఈ ఫార్మాట్‌లో 4 సెంచరీలు బాదేశాడు. 21 టీ20 అర్ధ శతకాలు సాధించాడు. స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్‌కు ముందు సూర్య ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ఆడాడు. ముంబై క్వాలిఫయర్స్ వెళ్లడంలో కీలకపాత్ర పోషించాడు. సూర్య 16 ఇన్నింగ్స్‌లలో 717 పరుగులు చేయగా, ఇందులో 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 2012లో %ఖూా% అరంగేట్రం చేసిన సూర్య 4 సంవత్సరాల పాటు కేకేఆర్ జట్టుకు ఆడాడు. 2018లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడి పరుగుల వరద పారించాడు. టీమిండియా తలుపు తట్టి టీ20ల్లో నెంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడు.

# కెరీర్‌లో కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా..

**● కొంతమంది తప్పుడు వ్యక్తులతో ఫ్రెండ్‌షిప్ చేశా**

**● యంగ్ బ్యాటర్ పృథ్వీ షా కీలక వ్యాఖ్యలు**

యంగ్ బ్యాటర్ పృథ్వీ షా కెరీర్ ఆరంభంలో అదిరే ఆటతీరుతో ప్రశంసలు అందుకున్నాడు. రాబోయే రోజుల్లో టీమ్‌ఇండియాలో కీలక ఆటగాడిగా మారడం పక్కా అని మాజీలు సైతం అభిప్రాయపడ్డారు. అయితే ఆ తర్వాత పేలవ ప్రదర్శన, ఫిట్‌నెస్ కోల్పోయిన పృథ్వీ ఇబ్బందుల్లో పడ్డాడు. వీటికితోడు క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరించడంతో పృథ్వీ విమర్శల పాలయ్యాడు. ప్రస్తుతం కౌంటీ, దేశవాళీ మ్యాచ్‌ల్లో ఆడుతున్నప్పటికీ పృథ్వీకి టీమ్‌ఇండియాలో చోటు కష్టంగా మారింది. మరోవైపు ఐపీఎల్‌లోనూ అన్‌సోల్డ్‌గా మిగిలిపోవడం, అప్పుడప్పుడు కాంట్రవర్సీల్లో చిక్కుకోవడంతో అతడి కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితుల్లో పృథ్వీ తాజాగా ఓ స్పోర్ట్స్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఇందులో అతడు కీలక వ్యాఖ్యలు చేశాడు. అలాగే కెరీర్‌లో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, ఆటపై దృష్టిపెట్టక పోవడానికి గల కారణాలను వెల్లడించాడు.'కెరీర్‌లో కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా. క్రికెట్‌కు తక్కువ సమయం ఇస్తున్నానని అర్థమైంది. అయితే 2023 వరకు నేను రోజులో సగం సమయం మైదానంలోనే ఉండేవాడిని. కానీ, ఆ తర్వాత కొన్ని చెడు విషయాలవైపు వెళ్లాను. కొంతమంది తప్పుడు వ్యక్తులతో ఫ్రెండ్‌షిప్ చేశాను. అయికే కెరీర్‌లో మనం సక్సెస్ అయినప్పుడు అనేక మంది స్నేహితులు మన దగ్గరకు వస్తారు. నాకూ అదే పరిస్థితి ఎదురై, లైన్ తప్పాను. దీంతో అంతకుముందు రోజులో 8 గంటలు గ్రౌండ్‌లో ఉండే నేను, కొత్త పరిచయాల తర్వాత 4 గంటలే గడిపాను"అలాగే నాకు ఫ్యామిలీ ప్రాబ్లమ్స్ కూడా ఉన్నాయి. మా తాతయ్య చనిపోయారు. ఆయనంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన మరణంతో కుంగిపోయాను. ఆ తర్వాత చాలా జరిగాయి. అవన్నీ మీతో షేర్ చేసుకోలేను. నా తప్పిదాలను నేను అంగీకరించా. ఆ పరిస్థితుల్లో మా నాన్న నాకు మద్దతుగా నిలిచారు. కష్ట సమయాల్లో నాకు ధైర్యాన్ని ఇచ్చారు' అని పృథ్వీ షా వివరించాడు.



# కోచ్ పాత్ర ఇప్పుడెంతో అవసరం..



ఈజీగా గెలవాల్సిన మ్యాచ్ లో భారత్ ఓడిపోవడంపై మాజీ కోచ్ రవి శాస్త్రి అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆటగాళ్లతో హెడ్ కోచ్ గౌతం గంభీర్ విడివిడిగా మాట్లాడి, వాళ్లలో జవాబుదారి తనాన్ని తీసుకు రావాలని సూచించాడు. నిజానికి అంతగా అంచనాలు లేకుండా ఇంగ్లాండ్ టూర్ కు వెళ్లిన భారత జట్టు తొలి టెస్టులో అదిరే ప్రదర్శననే ఇచ్చింది. జట్టు తరపున ఐదు సెంచరీలు నమోదు కావడంతో ఇండియా రెండు ఇన్నింగ్స్ లోనూ భారీ స్కోరే సాధించింది. అయితే కీలకదశలో కుప్పకూలి పోవడం, క్యాచ్ లు నేలపాలు చేయడంతో చివరకు ఈజీగా గెలవాల్సిన మ్యాచ్ లో పరాజయం పాలైంది. ఈ క్రమంలో పొరపాట్లు చేసిన ఆటగాళ్లతో సమావేశమై, వారిని తిరిగి గాడిలో పెట్టాలని సూచించాడు. ప్రస్తుతం తరుణంలో జట్టు పరిస్థితిని చక్కదిద్దేందుకు కోచింగ్ స్టాఫ్ పాత్ర కీలకమని గుర్తు చేశాడు. కెప్టెన్ గా అరంగేట్రం చేసిన తొలి మ్యాచ్ లోనే కెప్టెన్ శుభమాన్ గిల్ ఆకట్టుకున్నాడని శాస్త్రి తెలిపాడు. తను బ్యాటింగ్ లో ముందుండి సెంచరీ చేసి, తొలి ఇన్నింగ్స్ లో భారీ స్కోరు చేసేందుకు ప్రేరేపించాడని పేర్కొన్నాడు. అయితే ఆటాగాళ్లు క్యాచ్ లు డ్రాప్ చేయడం తన చేతుల్లో లేదని, మొత్తానికి పెట్టుకున్న అంచనాలకు తగినట్లుగా గిల్ రాణించడాని తెలిపాడు. అయితే ఈ మ్యాచ్ లో ఇండియాకు చాలా సానుకూల ఫలితాలు ఉన్నాయని, అయితే ఎక్కడైతే ఆటగాళ్లు గాడి తప్పారో వాళ్లతో విడిగా సమావేశమై పొరపాట్లను సరిదిద్దాలని సూచించాడు. పొరపాట్లు చేసే ఆటగాళ్లపై కాస్త కఠినంగా ఉండాలని సూచించాడు. జట్టులో ప్రతి ఆటగాడికి నిర్దిష్టమైన రోల్ ఉందని, జవాబుదారీ తనంతో ఆడాలని టీమిండియా ప్లేయర్లకు శాస్త్రి సూచించాడు. కొంతమందిపై ఆధారపడితే విజయాలు రావని సూచించాడు. ఇక ఈ మ్యాచ్ లో లోయర్ మిడిల్, లోయర్ ఆర్డర్ వైఫల్యం కావడంతో భారత్ అనుకున్నంత భారీ స్కోరు రెండు ఇన్నింగ్స్ లోనూ చేయలేక పోయింది. అలాగే పలు క్యాచ్ లు నేలపాలు కావడం కూడా శాపంగా మారింది. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ ఏకంగా మ్యాచ్ మొత్తం మీద నాలుగు క్యాచ్ లు డ్రాప్ చేశాడు. దీంతో ఇంగ్లాండ్ పుంజుకుని మ్యాచ్ ను కైవసం చేసుకుంది. రిషభ్ పంత్ కూడా రెండు క్యాచ్ లు జారవిడిచాడు. అలాగే బాగా హైప్ తో జట్టులో చోటు సంపాదించిన సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ తుస్సుమన్నారు. దీంతో రెండోటెస్టుకు ఈ లోపాలను సరిదిద్దుకోవాలని శాస్త్రి సూచిస్తున్నాడు. ఇక తొలి టెస్టు ఓడిపోయిన భారత్.. వచ్చేనెల 2న ఎడ్జ్ బాస్టన్ లో జరిగే రెండో టెస్టులో పుంజుకోవాలని చూస్తోంది. అయితే ఈ టెస్టులో టీమిండియాలో మార్పులు ఉంటాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్ లోనూ ఒకట్రెండు మార్పులు ఉండే అవకాశముంది. తొలి టెస్టు ఓటమితో పేసర్ హర్షిత్ రాణాను జట్టు నుంచి రిలీజ్ చేశారు.

# భారత్ ఖాతాలో చెత్త రికార్డు..

**- రెండో టెస్టులో పలు మార్పులతో బరిలోకి...**




ఇంగ్లాండ్ తో జరిగిన తొలి టెస్టులో ఓడిన భారత్.. ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఐదుగురు బ్యాటర్లు సెంచరీలు చేసిన తర్వాత కూడా ఓడిపోయిన తొలి జట్టుగా రికార్డులకెక్కింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో యశస్వి జైస్వాల్, శుభమాన్ గిల్, రిషభ్ పంత్, రెండో ఇన్నింగ్స్ లో కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ వరుసగా సెంచరీలు చేసిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఇలా ఓ జట్టు ఓడిపోవడం 148 ఏళ్ల క్రికెట్ చరిత్రలో ఇదే తొలి సారి కావడం విశేషం. ఇక ఈ మ్యాచ్ లో భారత్ తరపున ఎన్నో లోపాలు కనిపించాయి. ముఖ్యంగా ఈజీగా గెలిచే ఉండే స్థితిలో కూడా, చేజేతులా ఓడిపోవడంపై భారత అభిమానులు మండి పడుతున్నారు. ముఖ్యంగా రెండు ఇన్నింగ్స్ లో మంచి స్థితిలో ఉండి, కొల్లాప్స్ కావడం టీమిండియా కొంప ముంచింది. మరోవైపు 370ం పరుగుల టార్గెట్ విధించినప్పటికీ ఇంగ్లాండ్ చేతిలో టీమిండియా రెండుసార్లు ఓడిపోవడంపై పెదవి విరుస్తున్నారు. ఇక ఈ మ్యాచ్ లో టీమిండియా ప్లేయింగ్ లెవన్ సెలెక్షన్ బాగా లేదని విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా ప్లేయింగ్ లెవన్ లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ ఇద్దరికీ చోటు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మూడో నెంబర్లో అద్భుతంగా ఆడే కరుణ్ ను ఆరో స్థానంలో ఆడించడంపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇక మూడో నెంబర్లో సాయి విఫలమయ్యాడు. ఇక పేస్ ఆల్ రౌండర్ గా శార్దూల్ ఠాకూర్ ను తీసుకుని, అతడిని సరిగా ఉపయోగించుకోలేక పోవడంపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా అతడితో ఎక్కువగా బౌలింగ్ వేయించక పోవడం, బ్యాటింగ్ లో తను విఫలం కావడం పలు ప్రశ్నలకు ఆస్కారం వ్యక్తం అవుతోంది. ఇవన్నీ టీమ్ మేనేజ్మెంట్ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నాయి. ఇక ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుతంగా రాణించిన నితీశ్ రెడ్డిని కాదని శార్దూల్ ను ఏ బేసిస్ పై ఎంపిక చేశారని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇక బౌలింగ్ లోనూ మార్పులు చేయాల్సి ఉంది. ఇక రెండో టెస్టులో పలు మార్పులతో భారత్ బరిలోకి దిగాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ముఖ్యంగా శార్దూల్ స్థానంలో నితీశ్, ప్రసిధ్ స్థానంలో అర్షదీప్ సింగ్ ను ఆడించాలని పేర్కొంటున్నారు. వీలైతే స్పెషలిస్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ను ఆడించాలని కూడా సూచిస్తున్నారు. తొలి టెస్టు ఐదో రోజు స్పిన్ కు కాస్త అనుకూలించిన నేపథ్యంలో కుల్దీప్ ఉన్నట్లయితే కథ కాస్త వేరుగా ఉండేదని పేర్కొంటున్నారు. ఏదేమైనా కెప్టెన్ గా ఆడిన తొలి టెస్టులో శుభమాన్ గిల్ ఆకట్టుకున్నాడు. మిగతా మ్యాచ్ ల్లో సరైన ప్లేయింగ్ లెవన్ తో బరిలోకి దిగిన సత్ఫలితాలు పొందాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# బుమ్రాతో మూడు మ్యాచ్‌లే ఆడిస్తాం

**● కెప్టెన్‌గా గిల్‌కు సమయం ఇవ్వాలి**

**● టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్**



ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఐదు వికెట్ల తేడాతో టీమిండియా ఓటమిని చవిచూసింది. జట్టు ఓటమిపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక కామెంట్స్ చేశారు. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో గిల్ కెప్టెన్సీ, బుమ్రా ఎన్ని మ్యాచ్‌లు ఆడతాడు అన్న అంశాలపై ఆయన మాట్లాడారు. భారత టెస్ట్ కెప్టెన్ శుభమన్ గిల్‌కు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తన కెప్టెన్సీ ఓటమితో మొదలైందన్నారు.మ్యాచ్ నాలుగో రోజు మధ్యలో భారత్ కట్టుదిట్టంగా ఆధిపత్యం చెలాయించినప్పటికీ, చివర్లో వికెట్లు పతనమవడం, ఆపై ఇంగ్లాండ్ చేసిన అద్భుత ఛేజింగ్ వల్ల గిల్ నాయకత్వంలోని టీమ్ ఓటమిని మూటగట్టుకుంది. దీనిపై నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లాంటి కీలక ఆటగాళ్ల టెస్ట్ రిటైర్మెంట్ తర్వాత జట్టు పగ్గాలను గిల్ చేపట్టాడు.ఈ నేపథ్యంలో జట్టు ఓటమిపై గిల్‌కు గంభీర్ మద్దతుగా నిలిచాడు. మ్యాచ్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇది కెప్టెన్‌గా గిల్‌కు మొదటి టెస్ట్. సహజంగానే గిల్‌కు కొంత నర్వస్‌గా ఉండి ఉండొచ్చు. టెస్ట్ మ్యాచ్‌లకు కెప్టెన్సీ చేయడం ఒక గొప్ప గౌరవం. గిల్ ప్రదర్శన అద్భుతం. ముఖ్యంగా మొదటి ఇన్నింగ్స్‌లో చేసిన శతకంతో అతను తనేంటో నిరూపించుకున్నాడు. ఇప్పుడే అతనిపై నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదు. అతనిలో మంచి కెప్టెన్ కావడానికి కావాల్సిన అన్నీ ఉన్నాయి. కాబట్టి సమయం ఇవ్వాలి' అని గంభీర్ అన్నారు. అంతేకాదు, టెస్ట్ కెప్టెన్సీ అప్పగించడం అంటే గిల్‌ను లోతైన సముద్రంలోకి తోసినట్లే, అతను అది అధిగమించి ఒక నిజమైన ప్రొఫెషనల్‌గా బయటపడతాడన్న నమ్మకం నాకు ఉందని గంభీర్ అభిప్రాయపడ్డారు.ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆఖరి రోజు ఇంగ్లాండ్‌కి గెలిచేందుకు 22 పరుగులే కావాల్సిన సమయంలో రెండో న్యూ బాల్ వచ్చింది. ఆ సమయంలో అందరూ బుమ్రాకు బౌలింగ్ ఇస్తారని అనుకున్నారు. కానీ ఇవ్వలేదు. దీంతో బూమ్రాకు బౌలింగ్ ఇస్తే పరిస్థితి మారిపోయేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఇదే విషయాన్ని విలేకరులు గంభీర్‌ను అడగ్గా, మిగిలిన బౌలింగ్ యూనిట్‌పై కూడా పూర్తి నమ్మకముందని సమాధానమిచ్చారు. అయితే ప్రస్తుతం ఇంగ్లాండ్ టూర్‌లో ఉన్న బౌలింగ్ యూనిట్ కు తక్కువ అనుభవం ఉందన్నారు.'ఈ బౌలింగ్ టీమ్‌లో ఒకరికి ఐదు టెస్టుల అనుభవం,మరొకరికి నాలుగు,ఇంకొకరికి రెండు,ఇంకొకరు ఇప్పటికీ అరంగేట్రం చేయలేదు. వాళ్లకు సమయం ఇవ్వాలి. ఇంతకుముందు మన బృందంలో 40 టెస్టులకుపైగా అనుభవం ఉన్న నలుగురు పేసర్లు ఉండేవారు. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్,దక్షిణాఫ్రికాల్లో టెస్టు ఆడాలంటే అనుభవం చాలా అవసరం'అని గంభీర్ వివరించారు. ప్రతి టెస్ట్ తర్వాత వాళ్లను వెంటనే అంచనా వేస్తే మంచి బౌలింగ్ దళం ఎలా తయారవుతుంది అని గంభీర్ ప్రశ్నించారు. ఇప్పుడున్న వాళ్లలో బుమ్రా, మోహమ్మద్ సిరాజ్‌లకు తప్ప మిగిలిన వారికి అంత అనుభవం లేదన్నారు. అనుభవం అయితే లేదు కానీ, వారి ఆటలో నాణ్యత ఉందన్నారు. ఈ టూర్ గురించి కాదు, దీర్ఘకాలికంగా సేవలందించే బౌలింగ్ లైనప్ తయారు చేయడమే మా లక్ష్యమని గంబీర్ స్పష్టం చేశారు.అలాగే, ఇంగ్లాండ్ తో జరిగే ఐదు మ్యాచ్ ల టెస్టు సిరీస్ లో జస్ప్రీత్ బుమ్రాను మూడు మ్యాచ్ లను మాత్రమే ఆడిస్తామని మేనేజ్మెంట్ గతంలో చెప్పింది. ఆ మాటకు తాము కట్టుబడి ఉన్నామని గంభీర్ స్పష్టం చేశారు. బుమ్రాకు వర్క్‌లోడ్ తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బుమ్రా లేకపోతే భారత్ గెలవలేదన్న వాదనను ఆయన తోసిపుచ్చారు.

# ఆరుగురు క్రీడాకారులకు యూపీలో ప్రభుత్వ ఉద్యోగాలు



ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రింకూ సింగ్‌తో పాటు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చిన మరో ఆరుగురు క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది. భారత స్టార్ క్రికెటర్ రింకూ సింగ్ గురించి తెలియని వారుండరు. ఇటీవల రింకూసింగ్‌కు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రభుత్వ ఉద్యోగం లభించింది. అయితే ఈ గౌరవం పొందిన వారిలో రింకూ సింగ్ మాత్రమే కాకుండా మరో ఆరుగురు క్రీడాకారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాలలో నియమించాలని నిర్ణయించింది. ఈ క్రీడాకారులందరూ అంతర్జాతీయ స్థాయిలో దేశం కోసం పతకాలు సాధించి దేశ గౌరవాన్ని పెంచారు. ఇప్పుడు వారి కృషికి గుర్తింపుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వారికి ప్రభుత్వం సేవలో స్థానం కల్పిస్తోంది.ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ సింగ్ అధ్యక్షతన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ఎంపిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 7 మంది క్రీడాకారులను వారి కృషికి గుర్తింపుగా వివిధ విభాగాలలో నియమించాలని సిఫార్సు చేయబడింది. ఈ క్రీడాకారులందరి నియామకం ప్రత్యక్ష ఎంపిక ప్రక్రియ కింద జరిగింది, ఇది అంతర్జాతీయ పతక విజేత క్రీడాకారులకు మాత్రమే వర్తిస్తుంది.యూపీ సర్కారు క్రీడాకారులను నియమించినప్పటికీ సంబంధిత విభాగాల నిబంధనల ప్రకారం క్రీడాకారులు తదుపరి 7 సంవత్సరాలలోపు తమ విభాగానికి సంబంధించిన అన్ని అర్హతలను పూర్తి చేయాలి. తద్వారా వారికి ఉద్యోగంలో పదోన్నతి లభిస్తుంది. వారు అలా చేయలేకపోతే వారికి పదోన్నతి లభించదు. ప్రభుత్వం నియామక ప్రక్రియను ప్రారంభించింది. దీనిలో భాగంగా రింకూ సింగ్‌కు డాక్యుమెంట్ల కోసం ఒక లేఖ కూడా పంపబడింది.



## 1960 నేపథ్యంలోని కథ ..
# కోలీవుడ్ కి నాని?

కోలీవుడ్ కి నాని .. ఓ తమిళ సినిమాలో ఆయన చాలా కీలకమైన పాత్రను పోషించనున్నాడనే టాక్ ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. అందుకు సంబంధించి రంగం సిద్ధమైందని అంటున్నారు. ఇటీవల తెలుగులో నాని నటించిన 'హిట్ 3' సినిమా భారీ వసూళ్లను రాబట్టింది. ఈ సినిమాలో కార్తీ ఒక కీలకమైన పాత్రలను పోషించాడు. 'హిట్ 4'లో హీరోగా చేసేది కార్తీనే. ఇక తమిళంలో తను చేసే సినిమాలో ఒక కీలకమైన పాత్రను చేయమని కార్తీ కోరడంతో నాని అందుకు అంగీకరించాడని అంటున్నారు. గతంలో వెట్రి మారన్ దగ్గర అసిస్టెంట్ గా పనిచేసిన తమిజ్ ఈ సినిమాకి దర్శకుడు. జులై నుంచి ఈ సినిమా సెట్స్ పైకి వెళుతుందని చెబుతున్నారు. 1960ల నాటి కాలంలో .. రామేశ్వరం సముద్రతీర నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని సమాచారం.

ఇటీవలే 'సర్దార్ 2' సినిమాను పూర్తి చేసిన కార్తీ, ప్రస్తుతం 'ఖైదీ 2' సినిమా పనులతో బిజీగా ఉన్నాడు. వచ్చే నెల నుంచి తమిజ్ ప్రాజెక్టుపైకి వెళతాడు. కెరియర్ పరంగా కార్తీకి ఇది 29వ సినిమా. ఈ సినిమా కోసం ఆల్రెడీ నివిన్ పౌలీని .. జయరామ్ ను ఎంపిక చేశారు. ఈ సినిమాకి నాని ఓకే అనడంలో ఎంతవరకూ నిజముందనేదే తేలాలి.

# 'కూలీ' నుంచి అదిరిపోయే అప్‌డేట్..
## రజనీ 'చికిటు' పాట హల్‌చల్!

సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'కూలీ'. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా సినిమా నుంచి మొదటి పాట 'చికిటు'ను గురువారం విడుదల చేశారు. ఈ పాట విడుదలైన అతి తక్కువ సమయంలోనే సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటూ, యూట్యూబ్‌లో లక్షల కొద్దీ వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరపరిచిన ఈ 'చికిటు' పాటలో రజనీ తనదైన స్టైల్‌తో అభిమానులను ఉర్రూతలూగించారు. కేవలం రజనీ మాత్రమే కాకుండా సంగీత దర్శకుడు



అనిరుధ్, సీనియర్ నటుడు టి. రాజేందర్ కూడా ఈ పాటలో స్టెప్పులేయడం విశేషం. వీరి ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన ఈ పాట ప్రేక్షకులకు కనుల పండువ చేస్తోంది. అనిరుధ్ అందించిన మాస్ బీట్, రజనీ ఎనర్జీ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటను తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లోనూ ఏకకాలంలో విడుదల చేశారు. దీంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది.

'కూలీ' చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రజనీకాంత్‌తో పాటు బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్, టాలీవుడ్ కింగ్ నాగార్జున, కన్నడ స్టార్ ఉపేంద్ర, నటి శ్రుతిహాసన్, సీనియర్ నటుడు సత్యరాజ్, మలయాళ నటుడు సౌబిన్ షాహిర్ వంటి భారీ తారాగణం నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. లోకేశ్ కనగరాజ్ మార్క్ యాక్షన్, రజనీకాంత్ స్టైల్ కలగలిసి ఈ సినిమా ఓ సరికొత్త అనుభూతిని అందిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

ప్రస్తుతం శరవేగంగా ప్రచార కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'చికిటు' పాటతో మొదలైన ప్రమోషన్ల జోరు, సినిమా విడుదలయ్యే వరకు కొనసాగుతుందని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. ఈ పాట సృష్టిస్తున్న హంగామా చూస్తుంటే, 'కూలీ' బాక్సాఫీస్ వద్ద కూడా రికార్డులు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మిల్కీ బ్యూటీ క్రేజీ లైనప్

ఇండస్ట్రీలోకి వచ్చిన రెండు దశాబ్దాల తర్వాత కూడా తన ఫామ్ ను కంటిన్యూ చేస్తూ హంగామా చేస్తుంది మిల్కీ బ్యూటీ తమన్నా. ఇప్పటికి కూడా వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న తమన్నా మొన్నీమధ్య ఓదెల2 సినిమాతో ఆడియన్స్ ముందుకొచ్చింది. తమన్నా ప్రధాన పాత్రలో నటించిన ఓదెల2 భారీ అంచనాలతో వచ్చినప్పటికీ ఆ సినిమా అంచనాలను అందుకోలేకపోయింది. ఓదెల2 తర్వాత రైడ్2 సినిమాలో తమన్నా స్పెషల్ సాంగ్ చేసి ఎంతో మంది మనసుల్ని గెలుచుకున్న తమన్నా చేతిలో ప్రస్తుతం పలు ప్రాజెక్టులున్నాయి. ఓదెల2 తర్వాత తమన్నా తెలుగులో మరో సినిమాకు సైన్ చేయకపోయినా బాలీవుడ్ లో మాత్రం అమ్మడు పలు సినిమాలకు సైన్ చేసింది. తమన్నా లైనప్, ఆ సినిమాల డైరెక్టర్లు చూస్తుంటే తమన్నా అప్ కమింగ్ ప్రాజెక్టులపై ఆసక్తి పెరుగుతుంది. బాలీవుడ్ లోని స్టార్ డైరెక్టర్లతో తమన్నా సినిమాలు చేస్తోంది. అందులో భాగంగానే మిల్కీ బ్యూటీ రోహిత్ శెట్టి దర్శకత్వంలో ఓ బయోపిక్ లో నటించనుంది. జాన్ అబ్రహం మరియు రోహిత్ శెట్టి కలయికలో వస్తోన్న ఓ బయోపిక్ లో తమన్నా ఫీమేల్ లీడ్ గా కనిపించనుంది. దాంతో పాటూ బాలీవుడ్ హిట్ మూవీ నో ఎంట్రీకి సీక్వెల్ గా వస్తోన్న నో ఎంట్రీ2 లో తమన్నాకు అవకాశం లభించిందని సమాచారం. అనీస్ బాజ్మీ దర్శకత్వంలో వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జీత్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. ఆల్రెడీ డైరెక్టర్ తమన్నాకు నెరేషన్ ఇవ్వగా కథ నచ్చి ఆమె సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. త్వరలోనే షూటింగ్ ను మొదలుపెట్టి, కుదిరితే ఈ ఏడాదే సినిమాను రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఇక అజయ్ దేవగణ్, డైరెక్టర్ జగన్ శక్తితో కలిసి చేస్తున్న రేంజర్ అనే ఫారెస్ట్ అడ్వెంచర్ ఫిల్మ్ లో తమన్నా హీరోయిన్ గా నటిస్తోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న రేంజర్ సినిమాలో సంజయ్ దత్ విలన్ గా నటిస్తున్నారు. గతంలో అజయ్ దేవగణ్- తమన్నా కాంబినేషన్ లో హిమ్మత్ వాలా రాగా ఆ సినిమా డిజాస్టర్ అయింది. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు వారిద్దరి కలయికలో సినిమా వస్తోంది. ఇవి కాకుండా అరుణబ్ కుమార్, దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో సిద్ధార్థ్ మల్హోత్రాకు జోడీగా వివాన్ అనే సినిమాలో కూడా తమన్నా నటిస్తోంది. ఇవి చేస్తూనే టాలీవుడ్, కోలీవుడ్ లో మరిన్ని సినిమాలను లైన్ లో పెట్టడానికి తమన్నా కథలు వింటూ చాలా బిజీగా ఉంటోంది.



# చిరంజీవి-నాగార్జున మల్టీస్టారర్?

మెగాస్టార్ చిరంజీవి- కింగ్ నాగార్జునలను ఒకే ఫ్రేమ్ లో చూడాలని మెగా-అక్కినేని అభిమానులు ఎంతగా ఆశపడుతున్నారో? మాటల్లో చెప్పలేనిది. ఇండస్ట్రీలో ఇద్దరు బెస్ట్ ఫ్రెండ్స్ కావడంతో ఆ కలయికను వెండి తెరపై చూడాలని ఎంతో ఆశిస్తున్నారు. ఆ కాంబినేషన్ లో సినిమా ఎప్పుడు ఉంటుందా? అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ఆ ఛాన్స్ ఎప్పుడొస్తుందో చూడాలి. కానీ ఈ కాంబినేషన్ ని తెరపై ఆవిష్కరించిన దర్శకుడు మాత్రం ఎంతో అదృష్టవంతుడై ఉండాలి. చిరు-నాగ్ లను ఒకే సారి డైరెక్ట్ చేయడం అంటే అతడు పెట్టి పుట్టి ఉండాలి. ఆ అదృష్టవంతుడు ఎవరవుతారో చూడాలి. అలాగని కేవలం సీనియర్లకే సాధ్యమతుందా? అంటే అలాగని చెప్పలేని పరిస్థితి. నాగా ర్జున కొత్త దర్శకుల్ని ప్రోత్సహించడంలో ముందుంటారు. ఈ మధ్య కాలంలో చిరంజీవి కూడా అలాంటి వాళ్లను బాగానే ఎంకరేజ్ చేస్తున్నారు. కథనచ్చి అతడిపై నమ్మకముంటే వెళ్లిపోతున్నారు. సీనియర్ల కంటే వీళ్లే బెటర్ అన్న ధోరణి చిరు లో కనిపిస్తుంది. కాబట్టి డైరెక్ట్ చేసే అవకాశం కేవలం సీనియ ర్లకే కాదు...కొత్త వాళ్లకు కూడా ఉంటుంది. కనీసం ఒక సినిమా అయినా చేసి ఉంటే అవకాశం ఈజీ అవుతుంది. చిరు-నాగ్ ల ఇమేజ్ ను దృష్టిలో పెట్టుకుని సరైన స్క్రిప్ట్ తో అప్రోచ్ అయితే కొత్త రైటర్లకు అవ కాశం లేకపోలేదు. నేరుగా ఛాన్స్ రాకపోయినా? అతడి ఎంట్రీకి ఈ అవకాశం అన్నది దోహదం చేస్తుంది. ఇండస్ట్రీ విధానం మారిన నేపథ్యంలో రైటర్ నుంచి డైరెక్టర్ అవ్వడం పెద్ద విషయం కాదు. చిరు-నాగ్ లను కలపాలని గతంలోనే ఈవీవీ సత్యానారాయణ ఓ ప్రయత్నం చేసారు. కానీ సెట్ అవ్వ లేదు. అప్పటి నుం చి మరో డైరెక్టర్ అలాంటి ప్రయత్నాలు చేయలేదు. మరి ఇప్పుడా ఛాన్స్ ఎవరు తీసుకుంటారో చూడాలి.



## దేవదాసుకు 72 ఏళ్లు.. స్పెషల్ వీడియో విడుదల

అక్కినేని నాగేశ్వరరావు క్లాసిక్ చిత్రం 'దేవదాసు' విడుదలై నేటికి 72 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్ ఓ స్పెషల్ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేసింది. అక్కినేని ప్రధాన పాత్ర పోషించిన ఈ సినిమాకు వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహించారు. ఈ సినిమాతో అక్కినేని నాగేశ్వరరావు భారతీయ సినీ పరిశ్రమలో చరిత్ర సృష్టించారు. 'జగమే మాయ.. బ్రతుకే మాయ' అంటూ సాగే పాటకు నేటి తరంలోనూ అభిమానులు ఉన్నారు. కొన్ని కథలు ఎన్ని సంవత్సరాలు గడిచినా నిత్యనూతనంగా ఉంటాయనడానికి దేవదాసు కథే నిదర్శనమని అన్నపూర్ణ స్టూడియోస్ పేర్కొంది.



## 'పోలీస్‌వారి హెచ్చరిక' టీజర్ విడుదల



అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ నిర్మాతగా తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంలో రూపొందిన 'పోలీస్ వారి హెచ్చరిక' టీజర్‌ను సుధీర్ బాబు ఆవిష్కరించారు. ఈ చిత్రానికి గజ్వేల్ వేణు సంగీతాన్ని అందించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ పోలీస్ వారి హెచ్చరిక టీజర్ ఒక అస్త్రంలా ఆకర్షణీయంగా, అందరినీ అలరించే విధంగా ఉందని అన్నారు. దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ%ొ% "నేను ఏ సినిమా చేసినా ఆ సినిమా తాలూకు ఏదో ఒక కార్యక్రమాన్ని సూపర్‌స్టార్ కృష్ణ చేతుల మీదుగా జరుపుకునే వాడిని. సుధీర్ బాబు ఈ టీజర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది"అని పేర్కొన్నారు. నిర్మాత బెల్లి జనార్థన్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలోని ప్రముఖులు టైటిల్, ఫస్ట్ లుక్, లిరికల్ సాంగ్స్, ఆడియోను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు సన్నీ అఖిల్ పాల్గొన్నారు.